# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



చిత్తూరు జిల్లా వార్తలు

మంగళవారం 24 డిసెంబరు 2024




## చిట్లాకుప్పలు సిద్ధమవుతున్నాయహో!



సోమలలో కాటమరాజు ఆలయం వద్ద చిట్లా కుప్పలు వేస్తున్న రైతన్నలు

అప్పుడే పడమటి పల్లెలు చిట్లాకుప్పలకు కంపాకసరా సిద్ధం చేసుకుంటున్నాయి. సంక్రాంతి తర్వాత జనవరి 15న పశువుల పండుగ రోజున పల్లెల్లో కాటమరాజుల ఆలయాల వద్ద చిట్లా కుప్పలు వేస్తారు. ఊరి పశువులను ఊరేగింపుగా ఇక్కడికి తీసుకువచ్చి చిట్లాకుప్ప మంట చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. ఘనఘన మండే చెట్ల కోసం సమీప అడవుల్లోంచి కొమ్మలూ, పొదలూ నరికి పోగేసుకుంటున్నారు. సోమల-తిరుపతి రోడ్డు పక్కన కాటమరాజు ఆలయం వద్ద రైతులు సోమవారం చిట్లాకుప్పలు పోగేసే పనిలో కనిపించారు.

- సోమల, ఆంధ్రజ్యోతి





రామకుప్పం ఎంపీడీవో ఆఫీస్ రోడ్డులో కురుస్తున్న మంచు - బజారువీధిని కప్పేసిన హిమపాతం

## మంచు... ఎండ... చలిగాలులు

మన్యం ప్రాంతాన్ని తలపిస్తున్న వాతావరణంతో నాలుగైదు రోజులుగా రామకుప్పం ఉక్కిరిబిక్కిరవుతోంది. తెల్లవారు జామునుంచే దట్టమైన పొగమంచు ఆవరిస్తోంది.ఉదయం 8గంటల వరకు మంచు తెరలు తొలగక వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సివస్తోంది .అనంతరం మంచుదొంతరలను చీల్చుకుంటూ వచ్చిన భానుడు కొద్ది సేపటికే విజృంభిస్తున్నాడు.ఎండ బాగా కాస్తుండడంతో జనం ఉక్కపోతకు గురవుతున్నారు. సాయంత్రం వాతారణం నెమ్మదిగా చల్లబడుతోంది. చల్లటి గాలులతో ప్రజలకు ఉపశమనం కలుగుతోంది. ఉదయం మంచు ప్రభావంతో చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది.కానీ రాత్రి వేళల్లో గతంలో కంటే చలి తక్కువగా ఉంటోంది.

- రామకుప్పం, ఆంధ్రజ్యోతి



రామకుప్పం-రాజుపేటక్రాస్ రహదారిలో పొగమంచు



కుంకీలను మచ్చిక చేసుకోవడంలో ట్రాకర్‌కు శిక్షణ

# గజరాజుల కట్టడికి.....

**కర్ణాటక నుంచి రానున్న 4కుంకీ ఏనుగులు**

**కుంకీల విడిది కోసం రూ.5కోట్లతో ఏర్పాట్లు**

పలమనేరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికొచ్చే సమయంలో తొక్కి నాశనం చేయడంతో పాటు మనుషుల ప్రాణాలనూ బలిగొంటున్న గజరాజుల కట్టడికి ప్రభుత్వం చర్యలను వేగవంతం చేసింది.ఏనుగుల దాడులను నియంత్రించేందుకు తీసుకొస్తున్న శిక్షణ పొందిన కుంకీ ఏనుగుల విడిది కోసం పలమనేరు మండలం ముసలిమడుగు అటవీ ప్రాంతంలో యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు జరుగుతున్నాయి.పలమనేరు రేంజి పరిధిలోని అటవీ ప్రాంతం నుంచి సరిహద్దులో ఉన్న పంట పొలాలపై ఏనుగుల దాడులను నియంత్రించేందుకు జనవరి నెలాఖరు లోపు ఇక్కడికి నాలుగు కుంకీ ఏనుగులను తెప్పించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.ఇప్పటివరకూ పంటలపై దాడులు చేస్తున్న ఏనుగులను దారిమళ్లించి మళ్లీ అటవీ ప్రాంతంలోకి తరిమేందుకు ట్రాకర్లను ప్రభుత్వం రెండు దశాబ్దాలక్రితమే ఏర్పాటు చేసింది. వీరు ఆయా గ్రామాల వద్ద ఉంటూ ఏనుగులు వచ్చినప్పుడు గ్రామస్థుల సహకారంతో బాణసంచా కాల్చుతూ డప్పులు కొడుతూ అటవీ ప్రాంతంలోకి తరిమేస్తున్నారు.అర్ధరాత్రివేళ పంటలు తినేందుకు ఏనుగులు అలవాటు పడడంతో ట్రాకర్లు పూర్తిస్థాయిలో ఏనుగుల దాడులను కట్టడి చేయలేకపోతున్నారు.ఏనుగుల భయంతో పొలాల వద్ద ఉండలేక రైతులు చీకటి పడగానే ఇళ్లకు వస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఏనుగులను అటవీ ప్రాంతంలోకి మళ్లించాలంటే కుంకీ ఏనుగుల ద్వారా మాత్రమే సాధ్యమని అటవీ శాఖ అధికారులు ప్రభుత్వానికి సూచించారు. దీంతో కుంకీ ఏనుగులను రప్పించేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టింది.శాసనసభలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఏనుగుల సమస్య తీవ్రత గురించి మాట్లాడడంతో పాటు అటవీశాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికీ తీసుకెళ్లారు.

### కుంకీ ఏనుగుల వద్ద ట్రాకర్లకు శిక్షణ

జిల్లాకు రప్పిస్తున్న కుంకీ ఏనుగులతో మమేకం అయ్యేందుకు ఇక్కడ పనిచేస్తున్న 20 మందికి దాదాపు 20 రోజుల పాటు శిక్షణను ఇప్పటికే అటవీ శాఖ అధికారులు ఇప్పించారు. కర్ణాటకలోని మైసూరుకు దాదాపు 120 కిలోమీటర్ల దూరంలోని దుబరే నుంచి ఇక్కడికి రానున్న నాలుగు కుంకీ ఏనుగుల వద్ద శిక్షణ ఇప్పించారు. కుంకీ ఏనుగులకు ఏ విధంగా ఆహారాన్నందించాలి, ఏ విధంగా స్నానం చేయించాలి, వాటిపై అంబారీలేకున్నా ఎలా ఎక్కి వెళ్లాలి, ఏవిధంగా వాటిని మచ్చిక చేసుకోవాలో ట్రాకర్లకు అక్కడ శిక్షకులు తర్ఫీదు ఇచ్చారు.



కుంకీల కోసం ఏర్పాటు చేసిన నీటి కుంట



కుంకీల విడిది ప్రాంతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ లైను

### 50 ఎకరాల్లో విడిది ఏర్పాట్లు

కుంకీ ఏనుగులకు విడిది కోసం అటవీ శాఖ 50 ఎకరాల్లో ఏర్పాట్లు చేస్తోంది.కుంకీ ఏనుగులు ఉండేందుకు వృత్తాకారంలో ఒక విడిది ఏర్పాటు చేస్తున్నారు. ఈ వృత్తాకారం చుట్టూ రెండు అంచెలుగా కర్రలతో కంచె ఏర్పాటు చేస్తున్నారు.ఈ 50 ఎకరాల చుట్టూ సుమారు 3కిలోమీటర్ల పొడవుండే ట్రెంచ్‌లను తవ్విస్తున్నారు. ఇందుకోసం దాదాపు రూ.12 లక్షలకు పైగా కేటాయించి ఆన్‌లైన్‌లో టెండర్ల ప్రక్రియప్రారంభించారు.స్థానిక ఏనుగులు ఈ స్థలంలో ప్రవేశించకుండా ట్రెంచ్‌పక్కనుంచి హ్యాంగింగ్ సోలార్ ఫెన్సింగ్‌కూడా దాదాపు రూ.27లక్షలతో ఏర్పాటు చేస్తున్నారు. కుంకీ ఏనుగులను చూసుకొనే 8మంది మావటీలకోసం వసతి గృహాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.కుంకీ ఏనుగులు స్నానం చేసేందుకు సుమారు 30 అడుగులకు పైగా పొడవుతో 8 అడుగుల లోతుతో కుంటలను నిర్మించనున్నారు. కుంకీ ఏనుగులకు ప్రత్యేకంగా అందించే సంగటి ముద్దలను తయారు చేసేందుకు వంటగదిని కూడా నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు.కుంకీలకు గడ్డిమధ్యలో వరిధాన్యం, బెల్లం పెట్టి ఉండలుగా తయారు చేసి అందిస్తారు. ఈ గడ్డి వుండలను తయారు చేయడంలో కూడా ట్రాకర్లకు దుబరేలో శిక్షణ ఇచ్చారు.అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ రమేష్‌కూడా దుబరేలో శిక్షణ పొందారు.కుంకీల విడిది ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే ఆలోచనలో అటవీ శాఖ వుంది. ఇందుకు కారణం కుంకీ ఏనుగుల సంరక్షణకు పెద్దఎత్తున నిధులు కావాల్సి వుంటుంది. పర్యాటకుల నుంచి వసూలు చేసే ప్రవేశరుసుం కూడా వీటి నిర్వహణకు ఎంతో కొంత ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు.



### మదపు టేనుగులను మచ్చిక చేసేందుకు క్రాల్

మనుషుల ప్రాణాలనూ తీస్తున్న మదపుటేనుగులను మచ్చిక చేసేందుకు క్రాల్‌ను ఏర్పాటు చేశారు. అటవీ ప్రాంతంనుంచి కుంకీ ఏనుగుల ద్వారా తీసుకొచ్చిన మదపుటేనుగును ఈ క్రాల్‌లో బంధిస్తారు. ఒకటి రెండు రోజులు ఆహారాన్ని కట్టడి చేసి మెల్లమెల్లగా పరిమిత ఆహారాన్ని ఇస్తూ మచ్చిక చేసుకొని మళ్లీ మనుషులపై దాడులకు తెగబడవన్న విశ్వాసం వచ్చేవరకు వుంచుకొంటారు.

### ఏనుగుల ఆహార సమస్యపై ఇకనైనా దృష్టి పెట్టాలి

మూడు దశాబ్దాలుగా అటవీ సరిహద్దు గ్రామాల రైతులు పండించిన పంటలను అటవీ ప్రాంతం నుంచి ఏనుగులు వచ్చితిని తొక్కిపోతున్నాయి. దీనికి కారణం అటవీ ప్రాంతంలో ఏనుగులకు తగిన ఆహారం లభించకపోవడమే.ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వెదురు, చిన్న మొక్కలు, చెట్ల బెరడు, అడవుల్లో లభించే పండ్లు, చిన్నచిన్న పొదలు ఏనుగులకు ప్రధాన ఆహారం. రోజుకు ఒక ఏనుగు కనీసం 150 నుంచి 170 కిలోల శాఖాహారాన్ని తింటుంది.శరీర ఆకృతిని, వయసును బట్టి 80 నుంచి 110 లీటర్ల నీరు తాగుతుంది.

# గాలేరు-నగరి ఈఈ సస్పెన్షన్

**ఆదాల కంపెనీకి అక్రమంగా బ్యాంకు గ్యారంటీ వాపస్ ఫలితం**

తిరుపతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టుకు సంబంధించి తిరుపతి ఎఫ్ఏసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ)గా వ్యవహరిస్తున్న సీహెచ్ హరిబాబును ప్రభుత్వం సస్పెండ్ చేసింది. నెల్లూరు జిల్లా వైసీపీ నేత ఆదాల ప్రభాకర రెడ్డికి చెందిన నిర్మాణ కంపెనీకి.. నిబంధనలు ఉల్లంఘించి బ్యాంకు గ్యారెంటీ విడుదల చేసిన కారణంగా ఆయనపై వేటుపడింది. ఈ పథకం కింద కడప జిల్లా నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు కాలువ తవ్వాల్సి ఉంది. శేషాచల పర్వతాలు అడ్డుగా ఉన్నందున టన్నెల్ కూడా తవ్వాలి. ఈ పనుల ఇన్వెస్టిగేషన్, డిజైన్లతో పాటు మెయిన్ కెనాల్ 245వ కిలోమీటరు నుంచి 262.1వ కిమీ వరకు కాలువ తవ్వకం.. అలాగే 262.1వ కిమీ నుంచి 272.8వ కిమీ వరకూ బాలాజీ టన్నెల్-2 తవ్వకం, లైనింగ్ పనులకు 2007-08లో నాటి ప్రభుత్వం జలయజ్ఞం కింద టెండర్లు పిలిచింది. ఆదాల ప్రభాకరరెడ్డికి చెందిన ఏపీఆర్‌సీఎల్-సీఆర్ఎస్ఎస్‌జీ (జేవీ) హైదరాబాద్ కంపెనీకి టెండర్లు ఖరారయ్యాయి. ప్రభుత్వం ఆ కంపెనీకి మొబిలైజేషన్ అడ్వాన్సు కూడా చెల్లించింది. ఆ పనులకు సంబంధించి ఆ కంపెనీ రూ.1.36 కోట్లు బ్యాంకు గ్యారంటీ ఇచ్చింది. ఎంతకాలమైనా పనులు చేపట్టలేదు. దీంతో ఇంజనీరింగ్ అధికారులు కంపెనీకి నోటీసులు జారీ చేశారు. అడ్వాన్సు తీసుకుని కూడా పనులు చేపట్టనందున తీసుకున్న అడ్వాన్సు మొత్తాన్ని ప్రభుత్వానికి వాపస్ చేయాలని నోటీసుల్లో కోరారు. దీనికి ప్రతిగా కంపెనీ ప్రతినిధులు తమకు సకాలంలో అవసరమైన అనుమతులు, ఆమోదాలు ఇవ్వలేదని, దానివల్ల పనులు చేపట్టలేకపోయామని సమాధానమిచ్చారు. మొబిలైజేషన్ అడ్వాన్సుతో మెషినరీ కొనుగోలు చేశామని, పనులు లేక వాటిని ఖాళీగా పెట్టినందున తామే నష్టపోయామని అందులో పేర్కొన్నారు. అడ్వాన్సు నిధులు పోనూ ప్రభుత్వమే తమకు అదనంగా సుమారు రూ.91 లక్షలు చెల్లించాలని క్లెయిమ్ చేశారు. అప్పటి నుంచి ఆ వివాదం పెండింగులో ఉంది. కరోనా సమయంలో కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి చెల్లించాల్సిన బాకీలేవైనా ఉంటే వాటికి సరిపడా మాత్రమే బ్యాంకు గ్యారంటీలు ఉంచుకుని మిగిలిన గ్యారంటీలను విడుదల చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దానికనుగుణంగా ఆదాల కంపెనీకి కూడా గాలేరు-నగరి ప్రాజెక్టు ఎస్ఈ, ఈఈ నోటీసులిచ్చారు.అడ్వాన్సు వెనక్కి చెల్లించి బ్యాంకు గ్యారంటీ వాపస్ తీసుకోవాలని కోరారు. ఆ అధికారులు నిబంధనల ప్రకారం నిక్కచ్చిగా వ్యవహరించడంతో 2022-23లో వారిపై బదిలీ వేటు పడింది. ఆ స్థానంలో హరిబాబును ఎఫ్ఏసీ ఈఈగా నియమించారు. ఆయన వచ్చీ రాగానే ఆదాల కంపెనీకి ప్రభుత్వమే బాకీ పడిందని పేర్కొంటూ కంపెనీకి బ్యాంకు గ్యారెంటీని రిలీజ్ చేసేశారు. ఫలితంగా ప్రభుత్వం చెల్లించిన మొబిలైజేషన్ అడ్వాన్సును ఎలా వెనక్కి రాబట్టాలో అంతుబట్టక ఇరిగేషన్ ఉన్నతాధికారులు సతమతమవుతున్నారు. ఈ వ్యవహారం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకు గ్యారంటీలను విడుదల చేసిన హరిబాబుపై శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. ఆ క్రమంలో అతడిని సస్పెండ్ చేస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక కార్యదర్శి సీఎస్ సాయిప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## భూవిలువల పెంపుపై అభ్యంతరాల స్వీకరణకు నేడే చివరిరోజు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూవిలువలను సవరిస్తూ జనవరి 1వ తేదీనుంచి అమల్లోకి తెచ్చేందుకు స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి జిల్లావ్యాప్తంగా 0- 15శాతం మధ్య పెంపునకు ఈనెల 19వ తేదీన జేసీ విద్యాధరి అధ్యక్షతన జరిగిన జిల్లా మార్కెట్ వ్యాల్యూ రివిజన్ కమిటీ సిఫార్సు చేసింది. ఇందుకోసం ఈనెల 24వ తేదీ వరకు ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణకు గడువు నిర్ణయించింది.

## జడ్పీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రత్యేక పీఎఫ్ వెబ్‌సైట్ ప్రారంభం



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు

చిత్తూరు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ (జడ్పీ) ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రత్యేక పీఎఫ్ వెబ్‌సైట్‌ను జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో అందరికీ ఒకే సైట్ ఉండడం వల్ల ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో పీఎఫ్ వివరాలు చూసుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. ఇప్పుడు ఇబ్బంది లేకుండా జడ్పీ ఉద్యోగ, ఉపాధ్యాయుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వెబ్‌సైట్‌ను తీసుకొచ్చిందన్నారు. ప్రస్తుతం 2021 మార్చి వరకు పీఎఫ్ వివరాలు అందుబాటులో ఉన్నాయని, త్వరలోనే 2024 మార్చి వరకు వివరాలు పొందుపరుస్తామని చెప్పారు.

## టీచర్ల పదోన్నతి కౌన్సెలింగ్ వాయిదా

- కొలిక్కిరాని సీనియారిటీ జాబితా
- నేటి మధ్యాహ్నం నిర్వహణ



నోటీసు బోర్డులోని సీనియారిటీ జాబితాను మొబైల్ వెలుగులో పరిశీలిస్తున్న టీచర్లు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల టీచర్ల పదోన్నతి కౌన్సెలింగ్ వాయిదా పడింది. ఆదివారం స్కూల్ అసిస్టెంట్ల నుంచి నాలుగు హెచ్‌ఎం పోస్టులకు పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహించిన విషయం తెలిసిందే. సోమవారం ఎస్జీటీల నుంచి ఎస్ఏల పోస్టులకు పదోన్నతి కల్పించాల్సి ఉంది. మున్సిపాలిటీ పరిధిలోని రెండు పోస్టులకు, మున్సిపల్ కార్పొరేషన్‌లోని 25 మందికి పదోన్నతి కల్పించాల్సి ఉంది. ఇందుకోసం సీనియారిటీ జాబితా ఆధారంగా 1:3 నిష్పత్తిలో టీచర్లను కౌన్సెలింగ్‌కు పిలిచారు. ఉదయం 10 గంటలకు మొదలైన సీనియారిటీ జాబితా కసరత్తు రాత్రి 8.30 గంటలకూ కొలిక్కిరాకపోవడంతో విద్యాశాఖ అధికారులు కౌన్సెలింగ్‌ను మంగళవారం మధ్యాహ్నానికి వాయిదా వేశారు.విద్యాశాఖలో మున్సిపల్ టీచర్లు విలీనం కాకముందు ఆ విభాగంలో పదోన్నతులు అడ్డగోలుగా జరిగాయనే విమర్శలున్నాయి. ఏనాడు కౌన్సెలింగ్ నిర్వహించని మున్సిపల్ అధికారులు, వారి పరిధిలోని యూనియన్ నాయకులు, ఇతరత్రా సిఫార్సుల మేరకు అడిగిన వారికి పదోన్నతులు ఇచ్చారనే విమర్శలు ఉన్నాయి. టీచర్లు డీఎస్సీ అర్హత సాధించిన సంవత్సరం, పాఠశాలలో చేరిన తేదీ, కేటగిరి, జడ్పీ నుంచి మున్సిపాలిటీలకు అప్షనల్‌పై వచ్చిన తేదీ పరిగణలోకి తీసుకోని మున్సిపల్ అధికారులు చేతివాటంగా పదోన్నతులు ఇవ్వడం, వాటి రికార్డులు విద్యశాఖకు పూర్తిగా ఇవ్వకపోవడం వంటి కారణాలతో తాజాగా తయారు చేసే సీనియారిటీ జాబితాలో తేడాలు ఉన్నట్లు డీఈవో కార్యాలయ అధికారులు గుర్తించారు. వీటిని సవరించడానికి, సీనియారిటీ జాబితాలో అభ్యంతరాలు తెలపడానికి మూడు సార్లు అవకాశం ఇచ్చినా, మున్సిపల్ టీచర్లు స్పందించకపోవడంతో సమస్యగా మారింది. చివరి నిమిషంలో సీనియారిటీ జాబితా సిద్ధం చేశారని తెలిసి పలువురు అభ్యంతరాలు తెలపడం విద్యాశాఖ అధికారులకు తలనొప్పిగా మారింది. సవరణల అనంతరం రాత్రి 7 గంటల సమయంలో ఓ సీనియారిటీ జాబితాను నోటీసు బోర్డులో పెట్టగా, వాటిలోనూ తప్పులున్నట్లు ఇటు ఉపాధ్యాయులు, అటు టీచర్లు చెప్పడంతో సీనియారిటీ జాబితా కొలిక్కి రాలేదు. చేసేదేమి లేక మంగళవారం మధ్యాహ్నానికి మున్సిపల్ టీచర్ల పదోన్నతి కౌన్సెలింగ్‌ను వాయిదా వేశారు. ఉదయం 9 గంటలకే కౌన్సెలింగ్ కోసం దూర ప్రాంతాల నుంచి డీఈవో కార్యాలయానికి వచ్చిన టీచర్లు ఈసురోమని తిరుగుముఖం పట్టారు. మున్సిపాలిటీ పాఠశాలలను విద్యాశాఖలో విలీనం చేసిన తర్వాత ఇదే తొలి పదోన్నతి కౌన్సెలింగ్ కావడంతో ఉపాధ్యాయ సంఘాల నేతలు ఈ ప్రక్రియపై దృష్టి సారించారు. తమ దృష్టికి వచ్చిన అభ్యంతరాలను చివరి క్షణంలో విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకురావడం వాయిదా పడటానికి మరో కారణంగా మారింది.

## శ్రీవారిసేవలో న్యాయమూర్తులు



పార్థసారథి - జస్టిస్ భవాని సుబ్బరాయన్



జస్టిస్ కృష్ణకుమార్




జస్టిస్ అనిల్‌వర్మ



జస్టిస్ సంతోష్

తిరుమల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో..మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కృష్ణకుమార్, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భవాని సుబ్బరాయన్, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనిల్‌వర్మ, బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంతోష్, ఎంపీ గురుమూర్తి ఉన్నారు. వీరికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. రాష్ట్ర మంత్రి పార్థసారథి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

## హుండీ ద్వారా రూ.4.12 కోట్లు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 7 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచివున్నారు.

**శనివారం నాటి హుండీ ఆదాయం :** రూ.4.12 కోట్లు

**ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు :** 77,260

**తలనీలాలు సమర్పించినవారు :** 24,223



# ఎగ్జైట్‌మెంటిచ్చే ఎక్జోటిక్ పార్క్!







పంచరంగుల చిలుకమ్మలు మీ భుజాలమీద వాలుతాయి. చేతి మీద నిలబడి కబుర్లు చెబుతాయి. కొండచిలువలను మెడ చుట్టూ వేసుకుని సెల్ఫీ దిగచ్చు. ఊసరవెల్లులు, విచిత్రమైన అతి పెద్ద తొండలతో ఆడుకోవచ్చు. ఎడారి ఒంటె మీద ఎక్కి చక్కర్లు కొట్టచ్చు. రంగురంగుల చేపలు ఈదులాడే ఆక్వేరియంను వీక్షించవచ్చు. తిరుపతిలో ఇటీవలే ప్రారంభించిన 'ఏటూ జెడ్ ఎక్జోటిక్ పార్క్'లో ఈ వింత విశేషాలు అందుబాటులోకి వచ్చాయి. మంగళం రోడ్డులో ఆశా కన్వెన్షన్ సెంటర్ పక్కనే ఈపార్క్ ఉంది. చిట్టిపొట్టి విచిత్ర మేకలు.. గుర్రాలు.. గినీ పిగ్స్.. అరుదైన టర్కీ కోళ్లు, అడవి కోళ్లు, కుందేళ్లు, ఉడుములు, ముంగిసలు.. ఇలా ఎన్నోరకాల ఫ్రెండ్లీ పెట్స్‌తో సందర్శకులు సన్నిహితంగా ఉండచ్చు. పెట్స్ పెంపకంలో దాదాపు ఇరవై ఏళ్ల అనుభవం ఉన్న హర్షవర్ధన్ ఒకటిన్నర ఎకరాల స్థలంలో అరుదైన పక్షి, జంతువులతో ఈ మినీ జూపార్క్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక్కడ ప్రవేశ రుసుము 100 రూపాయలు.

### పెట్స్‌పై అవగాహన కోసం

ప్రకృతికి దగ్గరగా ఉన్న అనుభూతిని కలిగించేందుకు ఈ పార్క్ ఏర్పాటు చేశాం. విద్యార్థులకు పక్షి, జంతుజాతుల గురించి తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఇక్కడ ఉన్న కొన్ని పక్షులను కొనుగోలు చేశాం. ఎక్కువగా దత్తత వచ్చినవే ఉన్నాయి. ఒంటెను నెల్లూరు దగ్గర కాపాడి తీసుకొచ్చాం. ఎవరైనా పెంచుకోవాలని అనుకుంటే బ్రీడ్ అయిన జాతులను ఉచితంగా ఇవ్వాలనుకుంటున్నాం. జనవరి నుంచి దత్తత ఇవ్వడం ప్రారంభిస్తాం.

- హర్షవర్ధన్, ఎక్జోటిక్ పార్క్ నిర్వాహకుడు

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



## తిరుమలేశుని సేవలో భండారకేరి మఠాధిపతి

తిరుమల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉడిపిలోని భండారకేరి మఠాధిపతి విద్యేశతీర్థ స్వామి సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో శిష్యబృందంతో ఆలయ మహాద్వారం వద్దకు చేరుకున్న స్వామిజీకి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఆలయ అర్చక బృందం స్వాగతం పలికారు.

## స్థానికులకు జనవరి7న దర్శనానికి 5న టోకెన్ల జారీ

తిరుమల, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): జనవరి 7న తిరుమల దర్శనానికి స్థానికులకు టోకెన్‌లను జనవరి 5న విడుదల చేయనున్నారు. టీటీడీ బోర్డులో తీసుకున్న నిర్ణయం మేరకు ప్రతినెలా మొదటి మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జనవరి 5న తిరుపతి మహతి ఆడిటోరియంలో, తిరుమల బాలాజీనగర్‌లో శ్రీవారి దర్శన టికెన్లు జారీ చేయనున్నారు. తిరుపతి అర్బన్, రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలతో పాటు తిరుమలలోని స్థానికులు దర్శనానికి అర్హులు. ఒరిజనల్ ఆధార్‌కార్డు చూపించి టోకెన్లు పొందవచ్చు.

## 12న జాతీయ యువజనోత్సవం

తిరుపతి అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వివేకానంద జయంతి సందర్భంగా వచ్చే నెల 12వ తేదీన జాతీయ యువజనోత్సవం నిర్వహిస్తున్నట్లు సెట్విన్ ఇన్‌చార్జ్ సీఈవో మోహన్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మొదటి వారంలో యువతీయువకులకు పలు అంశాలపై పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 16 నుంచి 29 సంవత్సరాల లోపు వారు అర్హులని తెలిపారు. వచ్చే నెల 5వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 0877-2286921, 9440573537, 7036428762లను సంప్రదించాలని కోరారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

- భర్త మృతి, భార్య పరిస్థితి విషమం



మృతి చెందిన బాలాజీ - గాయపడిన మాధవి

చంద్రగిరి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎం.కొత్తపల్లి సమీపంలో పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్య తీవ్రంగా గాయపడింది. పోలీసుల కథనం మేరకు తిరుపతి రూరల్ మండలం తిరుచానూరుకు చెందిన బాలాజీ(37), భార్యతో కలసి ద్విచక్ర వాహనంపై చిత్తూరు నుంచి తిరుచానూరు వస్తున్నారు. ఎం.కొత్తపల్లి సమీపంలోకి రాగానే చిత్తూరు నుంచి తిరుపతి వైపు వస్తున్న కారు వీరి వాహనాన్ని ఢీ కొంది. ఈప్రమాదంలో బాలాజీకి భార్య తీవ్ర గాయాలవ్వడంతోఅక్కడిక్కడే మృతి చెందాడు. భార్యను తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి కూడా విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ ఉద్యోగి మృతి



చెంచునాథ్ (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి చెందాడు. శ్రీకాళహస్తి పట్టణం ఎంఎంవాడకు చెందిన చెంచునాథ్(40) అలియాస్ ఖాన్ పట్టణ శివార్లలోని రాజీవ్‌నగర్ ప్రాంతంలో పురపాలక సంఘం ద్వారా నీరు విడుదల చేసే విభాగంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తుండేవాడు. సోమవారం సాయంత్రం రాజీవ్‌నగర్ వాటర్ ప్లాంట్ వద్ద విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో రాజీవ్‌నగర్ సమీపంలోని పిచ్చాటూరు రహదారిపై ఆటో ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన చెంచునాథ్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

## వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనుల పరిశీలన



వాటర్ ట్రీట్‌మెంట్ ట్యాంక్‌పై చర్చిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే పులివర్తి నాని

పాకాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేరసానిపల్లె పంచాయతీ గుండ్లగుట్టపల్లె వద్ద నిర్మిస్తున్న వాటర్ ట్రీట్ మెంట్ ట్యాంక్‌ను చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే పులివర్తి నాని సోమవారం సందర్శించారు. అడవిపల్లె రిజర్వాయర్ నుంచి గుండ్లగుట్టపల్లె వాటర్ ట్రీట్‌మెంట్ ట్యాంక్‌కు నీరు చేరుతుంది. ట్యాంకులో నీటిని శుద్ధి చేశాక పైపులైన్ ద్వారా చిత్తూరు ఎన్టీఆర్ జలాశయానికి పంపడానికి పనులు చేపట్టారు. ఐదేళ్లుగా పాలకులు, అధికారులు నిర్లక్ష్య వైఖరితో పనులు నిలిచి పోయినట్టు గుర్తించారు. ట్రీట్‌మెంట్ ట్యాంక్‌కు స్థలం ఇచ్చిన రైతులకు మరింత నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామలని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రి దృష్టికి తీసుకెళ్లి టెండర్ల ద్వారా పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్టీఆర్ జలాశయానికి పంపే నీటిలో ఎమ్మెల్యే అభ్యర్థిన మేరకు 0.2 టీఎంసీలను పాకాల మండల చెరువులకు కేటాయిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ట్యాంకుపనులపై చర్చించారు. ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర ప్రసాద్, డీఈ రెడ్డి సురేష్, చిత్తూరు పబ్లిక్ హెల్త్ డీఈ నాయక్, అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ - ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి, వారి సమస్యలు వింటున్న అధికారులు

# పీజీఆర్ఎస్‌కు 243 వినతులు

### కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 243 వినతులు వచ్చాయి. అందులో భూ సమస్యలపై అత్యధికంగా రెవెన్యూ శాఖకు 153 ఉన్నాయి. కాగా, పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్ పలు కీలక మార్పులు చేశారు. గతంలో టోకెన్ కలిగిన అర్జీదారుడు పీజీఆర్ఎస్ వేదిక వద్దకు వెళ్లి కలెక్టర్‌కు లేదా జేసీకి, ఇతర అధికారులకు అర్జీలు అందజేసేవారు. అయితే ప్రతి అర్జీదారుడి సమస్యను సావధానంగా తెలుసుకునేందుకు వీలుగా ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. అన్ని శాఖల హెచ్ఓడీలను కౌంటర్ల వద్ద కూర్చోబెట్టి అర్జీదారుల సమస్యలు వినే విధంగా చర్యలు తీసుకున్నారు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రతి అర్జీని పరిష్కరించాలి**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ సదస్సులు, సీఎంవో, ఆన్‌లైన్‌లో ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీకీ బాధ్యతాయుతంగా పరిష్కారం చూపాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌పై జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా, మండల అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. రెవెన్యూ సదస్సుల్లో ఎక్కువగా భూ సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని పారదర్శకంగా పరిష్కరించాలని అన్నారు. సమావేశంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం ఉపసంహరించుకోవాలి

- కేంద్ర ప్రభుత్వానికి రైతు సంఘాల అల్టిమేటం
- కేంద్ర ప్రభుత్వ జీవోను దగ్ధం చేసిన నేతలు
- పోలీసులు, నేతల మధ్య వాగ్వాదం



జీవో ప్రతులను దహనం చేయగా.. మంటలు ఆర్పుతున్న పోలీసు కానిస్టేబుల్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ వ్యవసాయ మార్కెట్(ప్రైవేటీకరణ) విధానం ఉపసంహరించుకోవాలని, దీనిపై పాదయాత్ర చేస్తున్న రైతులపై అణచివేత ధోరణి విడనాడాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రైతు సంఘాల పిలుపు మేరకు వ్యవసాయ మార్కెట్ ప్రైవేటీకరణ కోసం తీసుకువచ్చిన జీవోను సోమవారం కలెక్టరేట్ వద్ద రైతు సంఘాల నేతలు దగ్ధం చేశారు. పోలీసులు ఆపేందుకు ప్రయత్నించడంతో తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు, నిరసనకారుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. అఖిల భారత రైతు సంఘాల సమాఖ్య సలహాదారుడు (సీఐఎఫ్ఏ) మాంగాటి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతు నాయకుడు జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కాపాడాలన్నారు. మూడు నల్ల చట్టాలు రద్దు చేస్తానని హామీ ఇచ్చిన ప్రధాని మోదీ దొడ్డిదారిన జాతీయ మార్కెట్ విధానాన్ని తీసుకువచ్చి రైతులను మోసం చేశారని దుయ్యబట్టారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి రామిశెట్టి వెంకయ్య మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర ఇవ్వాలని ఢిల్లీ సరిహద్దులో పోరాటం చేస్తున్న వారిని అణిచివేయాలని చూస్తే సహించమన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత మాట్లాడుతూ అన్నం పెట్టే రైతన్నలతో కంటనీరు పెట్టించడం సరి కాదన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా పోరాటం చేస్తున్న వారిపై కేసులు పెట్టి, జైల్లో వేయడం దుర్మార్గపు చర్య అన్నారు. అనంతరం జేసీ శుభం బన్సల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు జల్లా విశ్వనాథ్, ప్రజా సంఘాల నాయకులు పాటూరి వెంకటరత్నం, శివారెడ్డి, బండి చలపతి, ప్రవీణ్, శివ, మణి, పద్మనాభం, అల్లాబాషా, మునీశ్వర్, చందు నాయక్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వరకట్న వేధింపులకు వివాహిత బలి

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులు తట్టుకోలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన వినాయకనగర్ క్వార్టర్స్‌లో సోమవారం చోటు చేసుకుంది. అలిపిరి ఎస్ఐ నాగార్జున రెడ్డి కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా కలికిరికి చెందిన పీ గణేష్, కేవీపల్లికి చెందిన కే పార్వతమ్మ(27) మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఏడాదిన్నర కుమారుడు ఉన్నాడు. గణేష్ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. పార్వతమ్మ టీటీడీ పరిధిలోని పద్మావతి హృదయాలయ ఆస్పత్రిలో కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుగా పనిచేస్తోంది. పుట్టింటి నుంచి డబ్బు తీసుకురావాలంటూ కొన్ని రోజులుగా గణేష్ పార్వతమ్మపై ఒత్తిడి తేవడం మొదలుపెట్టాడు. ఇదే విషయమై ఇద్దరూ తరచూ గొడవ పడుతున్నారు. ఆదివారం గొడవ తారస్థాయికి చేరడంతో ఘర్షణపడ్డారు. మనస్తాపానికి గురైన పార్వతమ్మ అందరూ నిద్రించిన తర్వాత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి రాజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అలిపిరి పోలీసులు పార్వతమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. పంచనామా అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్ఐ నాగార్జున రెడ్డి నిందితుడు గణేష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## శ్రీవారి సేవకుడితో ఉద్యోగి బూతుల దండకం

తిరుమల, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): శ్రీవారి సన్నిధిలో ఒక ఉద్యోగి బూతులు మాట్లాడుతూ తనతో దురుసుగా ప్రవర్తించాడని శ్రీవారి సేవకు వచ్చిన ఒక భక్తుడు సోమవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం వేకువజామున సేవ పూర్తిచేసుకుని శ్రీవారిని దర్శించుకుని వెలుపలకు వస్తున్నపుడు పంచె కాళ్లకు తగలడంతో తను కిందకు వంగానని, అక్కడే విధులు నిర్వహిస్తున్న టీటీడీ ఉద్యోగి ఒకరు చెప్పుకోలేని పదాలతో బూతులు తిట్టాడని గుంతకల్‌కి చెందిన టీవీ లోకనాథం ఆరోపించారు. పవిత్రమైన స్వామి సన్నిధిలో ఇలా బూతులు మాట్లాడటమేమిటని ఆవేదన వ్యక్తం చేశారు ఈమేరకు ఆయన సేవా విభాగం అధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించిన అనంతరం ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని భావిస్తున్నట్టు సమాచారం. కాగా టీటీడీ ఉద్యోగులు శ్రీవారిసేవకులను చులకనగా మాట్లాడుతున్నారంటూ డయల్‌యువర్ ఈవో కార్యక్రమంలో కూడా గతంలో కొందరు ఆవేదన వ్యక్తం చేశారు.

## వైసీపీ నేతల పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి(జీవకోన), డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): కరెంటు చార్జీలు పెంచేశారంటూ వైసీపీ చేపట్టిన పోరుబాట పోస్టర్‌ను సోమవారం తిరుపతిలో ఆ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. పెరిగిన విద్యుత్తు చార్జీలపై ఈనెల 27వ తేదీ ఆయా విద్యుత్ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. ఇందుకోసం ప్రజలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ శిరీష, తిరుపతి సమన్వయకర్త భూమన అభినయరెడ్డి, నాయకులు అజయ్‌కుమార్, ఆంజనేయులు, నల్లనిబాబు, ఇమ్రాన్, అనిల్ పాల్గొన్నారు.

## డీఎంహెచ్‌వో బాధ్యతల స్వీకరణ

తిరుపతి(వైద్యం), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ బాలకృష్ణ నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నగరి ఏరియా ఆస్పత్రిలో సీఎస్ఆర్ఎంవోగా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ నాయక్‌ను ప్రభుత్వం డీఎంహెచ్‌వోగా నియమిస్తూ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఈ మేరకు ఆయన సోమవారం తిరుపతిలోని డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు వైద్యులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.





ముక్కంటి ఆలయం వద్ద ఉన్న భక్తులు

## ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తుల రద్దీ నెలకొంది. సోమవారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,716మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,703మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 1,951మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 720, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 259మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 230మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 86మంది భక్తులు పూజలుచేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 20,879 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

## 15 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 6వ తేదీ నుంచి జిల్లాలో ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు ఇప్పటివరకు 50 శాతం పైగా రెవెన్యూ గ్రామాల్లో పూర్తయ్యాయి. జిల్లాలో 822 రెవెన్యూ గ్రామాలుండగా, సోమవారం నాటికి 422 గ్రామాల్లో సదస్సులు పూర్తయ్యాయి. సోమవారం 15 గ్రామాల్లో జరగ్గా, 600 మంది గ్రామస్తులు పాల్గొని భూసమస్యలపై 28 అర్జీలు అధికారులకు అందజేశారు. దీంతో ఇంత వరకు అందిన అర్జీల సంఖ్య 7,318కి చేరాయి.

## ఎస్‌డబ్ల్యూసీ సభ్యుడిగా డాక్టర్ యుగంధర్



పలమనేరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మెడికల్ అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా పలమనేరుకు చెందిన డాక్టర్ యుగంధర్ నియమితులయ్యారు. గత రెండేళ్లుగా పలమనేరు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్న డాక్టర్ యుగంధర్ చేసిన సమాజ సేవలు, ఫ్రీమెడికల్ క్యాంపులు, డాక్టర్ల న్యాయమైన డిమాండ్ల కోసం చేసిన పోరాటాలను, డాక్టర్లకు నెలవారీ కంటిన్యూ మెడికల్ ఎడ్యుకేషన్ నిర్వహించడాన్ని పరిగణలోకి తీసుకొని ఈ పదవికి ఎంపిక చేశారు. ఏపీ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గత నవంబరునెల 23వతేది గుంటూరులో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మీదుగా రాష్ట్ర స్థాయి బెస్టు ప్రెసిడెంట్ అవార్డును డాక్టర్ యుగంధర్ అందుకొన్నారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యులు, పట్టణ ప్రముఖులు డాక్టర్ యుగంధర్‌కు అభినందనలు తెలియజేశారు.

## ఆటో డ్రైవరుకు రెండేళ్ల జైలు

చిత్తూరు లీగల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి మృతికి కారకుడైన ఆటో డ్రైవరుకు రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ చిత్తూరు న్యాయస్థానం తీర్పు చెప్పింది. 2022 నవంబరు 19వ తేదీన చిత్తూరు రూరల్ మండలం అనుపల్లె గ్రామం వద్ద ఆటో ఢీకొని తాసిఫ్ అనే వ్యక్తి మృతి చెందాడు. చిత్తూరు మంగసముద్రం హౌసింగ్‌కాలనీకి చెందిన నీలకంఠన్‌పై తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు సోమవారం చిత్తూరులోని మూడో కోర్టులో వాయిదాకు వచ్చింది. పూర్వాపరాలు పరిశీలించాక నిందితుడిపై నేరం రుజువుకావడంతో రెండేళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శ్రీనివాస్ తీర్పు చెప్పారు.

## పట్రపల్లె భూముల వద్ద లోకాయుక్త విచారణ



బాధితులను విచారిస్తున్న అధికారి గంగరాజు

వి.కోట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వి.కోట పట్టణానికి సమీపంలోని పట్రపల్లె జగనన్న కాలనీలో జూనియర్ కళాశాల బాధితులకు ఇంటి స్థలాలు ఇవ్వకుండా గత వైసీపీ పెద్దలు వాటిని పరుల పరం చేశారని బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై సోమవారం లోకాయుక్త బృందం విచారణ చేపట్టారు. కర్నూలు లోకాయుక్త అడిషనల్ డైరెక్టర్ గంగరాజు నేతృత్వంలో అధికార బృందం వి.కోటకు చేరుకున్నారు. 30 ఏళ్ల క్రితం ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం గతంలో దళితులకు కేటాయించిన సుమారు పది ఎకరాల భూమిని ప్రభుత్వం తీసుకుందని, వేరే భూములను తమకు కేటాయించలేదని బాధితులు లోకాయుక్తను ఆశ్రయించారు. ఈవివాదంపై 30 ఏళ్లుగా కోర్టులో వాజ్యాలు నడుస్తున్నాయి. గడచిన వైసీపీ ప్రభుత్వ హయాంలో తహసీల్దార్ రవి అప్పటి వైసీపీ పెద్దల సూచన మేరకు బాధితులకు న్యాయం చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ఫిర్యాదు చేశారు. దీంతో బదిలీపై వేరే చోట పనిచేస్తున్న తహసీల్దార్ రవి సహా స్థానిక రెవెన్యూ అధికారులతో సోమవారం క్షేత్రస్థాయికి చేరుకున్నారు. అక్కడ కోర్టు ఉత్తర్వుల మేరకు బాధితులకు ఇవ్వాల్సిన స్థలాలను ఇతరులకు కేటాయించగా.. వారు పక్కా గృహాలు నిర్మించుకున్నారని తమ విచారణలో తేలిందని లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ గంగరాజు తెలిపారు. దీంతో పక్కనే ఉన్న ప్రభుత్వ భూముల్లో స్థలాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని బాధితులు విచారణాధికారికి విన్నవించారు. ఈ మేరకు నివేదికను ఉన్నతాధికారులకు పంపి తగిన న్యాయం చేస్తామని ఆయన తెలిపారు.

## ద్రావిడ వర్సిటీకి త్వరలో నాక్ కమిటీ

గుడుపల్లె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయంలో జనవరి 22, 23, 24 తేదీల్లో నాక్‌కమిటీ బృందం పర్యటించనున్నట్టు రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్ తెలిపారు. 2018లో నాక్ కమిటీ వర్సిటీలో పర్యటించి బీ-గ్రేడ్ ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఐదేళ్ల తర్వాత తిరిగి నాక్ కమిటీ బృందం పర్యటించనుందని ఆయన తెలిపారు. ఈనేపథ్యంలో వర్సిటీని ముస్తాబు చేస్తున్నట్టు ఆయన వివరించారు. ఇప్పటికే వర్సిటీ ఎస్ఎస్ఆర్‌ను నాక్‌కు సమర్పించామన్నారు. నాక్ కమిటీ పర్యటన ఉండటం వల్ల జనవరి నెలలో ఉద్యోగులెవరూ సెలవు పెట్టరాదని సర్క్యులర్ జారీ చేసినట్లు చెప్పారు. నాక్ కమిటీ పర్యటన తర్వాత వర్సిటీకి ఏ-గ్రేడ్ వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## బోయకొండ ఆలయ మాజీ చైర్మన్‌ను దుర్భాషలాడిన వ్యక్తుల అరెస్టు

**41ఏ నోటీసులు ఇచ్చి వదిలేసిన తెలంగాణ పోలీసులు**

చౌడేపల్లె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బోయకొండ ఆలయ మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు ఎస్కే వెంకటరమణారెడ్డిని దుర్భాషలాడిన వ్యక్తులను తెలంగాణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.హైదరాబాదులోని చందనగర్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ పద్మనాభం కథనం మేరకు.... రెండు నెలల క్రితం చౌడేపల్లె మండలంలోని చారాల, శెట్టిపేట, దుర్గసముద్రం పంచాయతీలకు చెందిన శ్రీనివాసులు, పరమేశం, సాగర్, శ్రీనాథ్, అజయ్ తనకు ఫోన్ చేసి దుర్భాషలాడారని హైదరాబాదు చందనగర్‌లో వుంటోన్న వెంకటరమణారెడ్డి ఆధారాలతో అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదుపై కోర్టు ఆదేశాలతో కేసు నమోదు చేసిన చందనగర్ పోలీసులు అజయ్ మినహా నలుగురు నిందితులను అరెస్టు చేసి చౌడేపల్లె పోలీస్ స్టేషన్‌కు సోమవారం ఉదయం తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. చివరకు నిందితులకు 41ఏ నోటీసులు ఇచ్చి పంపినట్లు పద్మనాభం తెలిపారు.

## కువైట్ చెరలోని మహిళకు విముక్తి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కువైట్‌లోని ఏజెంట్ చెరలో చిక్కుకున్న తిరుపతి జిల్లా యువతికి విముక్తి లభించనుంది.ఈనెల 27న ఆమె తిరుపతికి రప్పించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎస్పీ సుబ్బరాయుడు చొరవ తీసుకుని ఆమెకు విమాన టికెట్ సిద్ధం చేశారు. బిడ్డలను చదివించుకోవాలని కువైట్‌కు వెళ్లి నరకకూపంలో చిక్కుకున్న శ్రీకాళహస్తి మండలం రాజీవ్ నగర్‌కు చెందిన ఎల్లంపల్లి లక్ష్మి ఆవేదనపై 'నన్ను చంపి ఎడారిలో పడేస్తామంటున్నారు' శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది.ఎస్పీ సుబ్బరాయుడు స్పందించి దుబాయ్‌లో ఉన్న తిరుపతికి చెందిన ఏపీఎన్ఆర్టీ మాజీ కోఆర్డినేటర్ డాక్టర్ ముక్కు తులసీకుమార్‌ను ఫోన్లో సంప్రదించారు. వివరాలు అడిగితెలుసుకున్నారు. ఆమెను తిరుపతికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ గిరిధర్‌కు ఆదేశాలిచ్చారు. దీంతో డీఎస్పీ రంగంలోకి దిగి ఆమెను కువైట్‌కు పంపిన పీలేరు ఏజెంట్ శ్రీనివాస్‌తో మాట్లాడారు. ఆయన ద్వారా కువైట్‌లోని ఏజెంట్‌తో మాట్లాడి టికెట్ పంపారు.



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి తదితరులు, కలెక్టరేట్ వద్ద జీడీ నెల్లూరు చెరిమిరెడ్డిపల్లె యానాదులు, రైతు సంఘ నేతల నిరసన

# వినతులివే.. పరిష్కరించండి

**● కలెక్టరేట్‌లో జరిగిన 'పీజీఆర్ఎస్'కు 178 అర్జీలు**

చిత్తూరు అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. మొత్తం 178 అర్జీలు అందాయి. బాధితుల నుంచి వినతిపత్రాలను కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు తదితరులు స్వీకరించారు. రెవెన్యూశాఖకు 145 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు.

**ప్రధానంగా వచ్చిన అర్జీలిలా..**

● 20 ఏళ్ల క్రితం తమ ఇద్దరికీ భూ పంపిణీ ద్వారా 3.20 ఎకరాలను ప్రభుత్వం మంజూరు చేసి, పట్టాదార్ పాసుపుస్తకాలను కూడా పంపిణీ చేసిందని చౌడేపల్లె మండలం మోట్లపల్లె యానాదికాలనీకి చెందిన వెంకటమ్మ, రామకృష్ణ తెలిపారు. ఈ భూమిలో బోరు వేసుకుని మామిడి మొక్కలతోపాటు వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. మూడ్రోజుల కిందట కొందరు అగ్రకులస్తులు వచ్చి తమను బెదిరించి, భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారని ఆరోపించారు. ఈ భూమి తప్ప తమకు వేరే ఆధారం లేదని, న్యాయం చేయాలని వేడుకున్నారు.

● తమకు గోకులం షెడ్డును మంజూరు చేయాలని పూతలపట్టు మండలం శేషాపురం యానాది కాలనీకి చెందిన బుజ్జమ్మ కోరారు.

● కూలి పనులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు వ్యవసాయం చేసుకోవడానికి ప్రభుత్వ భూమిని మంజూరు చేయాలని గుడిపాల మండలం మండి కృష్ణాపురం ఎస్టీకాలనీకి చెందిన రాణి, మేఘ కోరారు.

● తాగునీటి బోరు నుంచి యానాదికాలనీకి నీటిని వదలడం లేదని జీడీ నెల్లూరు మండలం చెరిమిరెడ్డి పంచాయతీ యానాది కాలనీ చెందిన వారు ఫిర్యాదు చేశారు. కాలనీలో 12 కుటుంబాల వారు నివాసముంటున్నారని తెలిపారు.

● ఇంటి పట్టాలు, దారి సమస్యను పరిష్కరించాలని చిత్తూరు రూరల్ మండలం జర్రిమడుగు యానాది కాలనీకి చెందిన ఐదు కుటుంబాలు కోరాయి.

● ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న రైతులపై అణచివేత ధోరణి ఆపాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ముందు నిరసన చేపట్టారు. జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం, డిజిటల్ అగ్రికల్చర్ మిషన్, జాతీయ పాలసీలను ఉపసంహరించుకోవాలన్నారు. ప్రధాని మోదీ కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనాలను చేకూర్చేలా కొత్త చట్టాలను తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారన్నారని ఆరోపించారు. నేతలు ఉమాపతినాయుడు, మునిరత్నం నాయుడు, రామానాయుడు, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

**పోలీసు కార్యాలయంలో 28 అర్జీలు**

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో బాధితుల నుంచి ఎస్పీ మణికంఠ అర్జీలను స్వీకరించారు. కొన్ని సమస్యలను పరిష్కరించాలని అక్కడికక్కడే ఫోన్ ద్వారా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 28 అర్జీలు అందాయి. వీటిల్లో.. భూ తగాదాలపై 8, కుటుంబ తగాదాలపై 6, డబ్బు తగాదాలపై 3, ఆస్తి తగాదాలపై 3, దారి సమస్యలపై 3, చీటింగ్‌పై 2, వేధింపులపై 2, ఇంటి తగాదాలపై 1 ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీఎస్పీ సాయినాథ్, పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

# విండోలకు మరో ఆరునెలలు

**పర్సన్ ఇన్‌చార్జిల కొనసాగింపు**

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు (సింగిల్ విండోలకు) పర్సన్ ఇన్‌చార్జిలు మరో ఆరునెలలు కొనసాగనున్నారు. ఈనెల 21వ తేదీనుంచి 2025 జూన్ 20వరకు కొనసాగనున్నారు. ఆరు మాసాలు లేదా కొత్తపాలకవర్గాలు వచ్చేవరకు కొనసాగనున్నారు. గత ప్రభుత్వ హయాంలో కమిటీల స్థానంలో పర్సన్ ఇన్‌చార్జి (పీఐసీ) వ్యవస్థను తీసుకొచ్చారు. దీంతో సింగిల్ విండోలు, డీసీసీబీలు, సీడీసీఎంఎస్‌లు అధికారుల నియంత్రణలోకి వచ్చారు. డీసీసీబీ, సీడీసీఎంఎస్‌ల కాల వ్యవధి ఈనెల 27వ తేదీకి ముగియనుండడంతో ఈ రెండు సంస్థల పర్సన్ ఇన్‌చార్జిలను ఆరు నెలల పాటు లేదా ఎన్నికలు జరిగే వరకు ఈనెల 27వ తేదీ నుంచి 2025 జూన్ 26 వరకు కొనసాగుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

**కమిటీలతో కాలయాపన**

ఉమ్మడి జిల్లాలో 75 సింగిల్ విండోలు ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వం 2013లో ఎన్నికలు నిర్వహించింది. 2018లో కాలపరిమితి తీరిపోవడంతో పాత పాలకవర్గాలనే కొనసాగిస్తూ వచ్చింది. ఆరునెలల కాలానికి రెండు దఫాలుగా ఏడాదిపాటు పాత పాలక వర్గాలనే కొనసాగించింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక నామినేటెడ్ కమిటీలను నియమించింది. సింగిల్ విండోలకు త్రిసభ్య కమిటీలు (ఇందులో చైర్మన్, ఇద్దరు సభ్యులు ఉంటారు), డీసీసీబీ, సీడీసీఎంఎస్‌లకు ఏడుగురు సభ్యుల కమిటీలు (నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి) ఏర్పాటయ్యాయి. సొంత పార్టీకి చెందినవారికే పదవులు ఇచ్చారు. ప్రతి ఆరు నెలలకు కాలపరిమితిని పొడిగిస్తూ ఐదేళ్ల పాటు ఎన్నికలు జరపకుండా కాలయాపన చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక వారందరితో రాజీనామాలు చేయించి అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జిలను నియమించింది. వీరినే కొనసాగించడంతో త్వరలో ఎన్నికల దిశగా చర్యలు తీసుకునే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. సింగిల్ విండోలకు సహకార శాఖలో పనిచేసే సహాయ రిజిస్ట్రార్, సీనియర్, జూనియర్ ఇన్‌స్పెక్టర్లను పీఐసీలుగా నియమించారు.

## ట్రాక్టర్ డ్రైవర్‌కు రెండేళ్ల జైలు



పోలీసుల అదుపులో సురేష్

వెదురుకుప్పం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి కారకుడైన డ్రైవర్ సురేష్(37)కి రెండేళ్ల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ.4,500 జరిమానా విధించినట్లు కార్వేటినగరం ఎస్ఐ రాజ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఏర్పేడు మండలం ఆర్వీ కండ్రిగకు చెందిన పి.సురేష్(37) ట్రాక్టరు డ్రైవింగ్ చేసుకుంటూ కార్వేటినగరం లక్ష్మీ నరసింహ విద్యాసంస్థ సమీపానికి వచ్చాక ఓ బైక్‌ను చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిలో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కార్వేటినగరం మండలం అన్నూరు గ్రామం చిన్నమందడి(84) మృతి చెందాడు. ఈ ఘటన 2021లో జరిగింది. దీనిపై కార్వేటినగరం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు సోమవారం రుజువు కావడంతో ట్రాక్టరు డ్రైవర్‌కు జైలుశిక్ష, జరిమానాను ఫస్ట్‌క్లాస్ పుత్తూరు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ విధించారని ఎస్ఐ వివరించారు.

## నేడు టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

తిరుమల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం మంగళవారం తిరుమలలో జరగనుంది. బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో సభ్యులు అన్నమయ్య భవనంలో సమావేశం కానున్నారు. దాదాపు 66 అంశాలపై రూపొందించిన అజెండాపై చర్చించనున్నట్టు తెలిసింది. ప్రధానంగా ఆస్పత్రుల నిర్వహణ, టీటీడీ ఆస్తుల పరిరక్షణ, తిరుమలలోని హోటళ్లలో ఆహారపదార్థాల నాణ్యత పెంపుపై తీసుకోవాల్సిన చర్యలు, శ్రీవారికి నగదు, బంగారు పెట్టుబడులపై ప్రత్యేక నిపుణులతో కమిటీ ఏర్పాటు, తిరుమల విజన్-2047, ఉద్యోగులకు నేమ్ బ్యాడ్జీ ఏర్పాటుతో పాటు పలు ముడిసరుకుల కొనుగోళ్లపై చర్చించనున్నట్టు సమాచారం. ముఖ్యంగా టీటీడీ చేస్తున్న వృథా ఖర్చుల నియంత్రణపైనా చర్చిస్తారని తెలిసింది.

# ఎస్వీయూ హాకీ జట్టులో గోవిందపల్లె విద్యార్థిని



ఝాన్సీ

రామకుప్పం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ఉన్సిగానిపల్లె పంచాయతీ గోవిందపల్లెకు చెందిన విద్యార్థిని ఝాన్సీ ఎస్వీ యూనివర్సిటీ మహిళా హాకీ జట్టులో చోటు దక్కించుకుంది. గోవిందపల్లెకు చెందిన గోవిందస్వామి, ధనమ్మ దంపతులు కుమార్తె పాఠశాల స్థాయి నుంచే హాకీలో విశేష ప్రతిభ కనబరుస్తోంది. ఆనిగానూరు ఉన్నత పాఠశాలలో పీడీ నరేష్ కోచింగ్‌లో రాటుదేలిన ఝాన్సీ గతంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని, రాణించింది. ప్రస్తుతం ఝాన్సీ పద్మావతి మహిళా కళాశాలలో బీఏ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఇటీవల ఎస్వీ యూనివర్సిటీలో జరిగిన ఎంపికల్లో ఆమె యూనివర్సిటీ మహిళా హాకీ జట్టుకు ఎంపికైంది. ఉన్నత పాఠశాలలో చదువుతున్నపుడు పీడీ నరేష్ ఇచ్చిన కోచింగ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తాను ప్రస్తుతం యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యానని ఝాన్సీ తెలిపారు. ఈనెల 26న తిరుచిరాపల్లెలోని భారతిదాసన్‌లో జరిగే జాతీయ స్థాయి యూనివర్సిటీ పోటీల్లో తమ జట్టు పాల్గొననుందని ఆమె తెలిపారు. ఝాన్సీ యూనివర్సిటీ జట్టుకు ఎంపిక కావడం పట్ల టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, ఉన్సిగానిపల్లె మాజీ సర్పంచులు రామ్మూర్తి, మహాదేవి, టీడీపీ ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి జయశంకర్, తెలుగుయువత నియోజకవర్గ ప్రధానకార్యదర్శి శంకర్‌చలం, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నేతలు మహేంద్ర నాయుడు, మణిష్, రామలింగం, షణ్ముగంలు హర్షం వ్యక్తం చేశారు. ఝాన్సీ జాతీయ యూనివర్సిటీ పోటీల్లో రాణించాలని, భవిష్యత్తులో ఆమె భారత మహిళా జట్టులో చోటు దక్కించుకోవాలని వారు ఆకాంక్షించారు.

## అందరికీ మంచి జరగాలి : కలెక్టర్



కొవ్వొత్తులతో కలెక్టర్ సుమిత్‌కుమార్, ప్రభుత్వ విప్ థామస్, చుడా చైర్‌పర్సన్ హేమలత, మేయర్ అముద, తదితరులు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అందరికీ మంచి జరగాలి.. అందరం ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నానని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సోమవారం రాత్రి కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో క్రిస్మస్ పండుగ సందర్భంగా జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ముందస్తు హైటీ కార్యక్రమం ఘనంగా జరిగింది. కేక్‌ను కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మన ఊరు, మన జిల్లా అభివృద్ధి చెందాలంటే అందరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ విప్ థామస్ మాట్లాడుతూ.. చర్చిల నిర్మాణం, మరమ్మతులకు, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు ప్రభుత్వం రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందిస్తోందని చెప్పారు. జేసీ విద్యాధరి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత తదితరులు ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. చిత్తూరు మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో మోహన్ కుమార్, హౌసింగ్ పీడీ పద్మనాభం, ఎల్‌డీఎం హరీష్, వివిధశాఖల అధికారులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

**స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో**

## కుప్పం ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రభంజనం



విజేతలైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

కుప్పం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ఆవరణలో ఈనెల 20వ తేదీనుంచి 22వ తేదీవరకు నిర్వహించిన 27వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో కుప్పం పట్టణంలోని డాక్టర్ వైసీ జేమ్స్‌యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరచి 3 స్వర్ణ, 4 రజత, 5 కాంస్య పతకాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగన్నాథరావు తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కళాశాలలో సోమవారం సత్కారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎస్వీయూ రీజియన్‌లోని మొత్తం 12 పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు ఈ గేమ్స్ మీట్‌లో 18 విభాగాలలో పోటీపడ్డారన్నారు. ఇందులోని 11 విభాగాలలో 13 పతకాలను తమ విద్యార్థులు సాధించడం కళాశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. 1500 మీటర్ల పరుగు పందెంలో ఈసీఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థి డి.కార్తీక్, జావెలిన్ త్రోలో జి.కార్తీక్ బంగారు పతకాలను పొందారని చెప్పారు. బాల్‌బ్యాడ్మింటన్‌లో కూడా బంగారు పతకాన్ని తమ విద్యార్థులు సాధించారని చెప్పారు. కంప్యూటర్ బ్రాంచి విద్యార్థి షేక్ రోహిత్ లాంగ్ జంప్, హై జంప్, ట్రిపుల్ జంప్ విభాగాలలో ద్వితీయ స్థానంలో నిలిచి ఏకంగా 3 రజత పతకాలు పొందారన్నారు. అదే విభాగం విద్యార్థి కె.జగన్మోహన్ చెస్‌లో రజత పతకాన్ని పొందారన్నారు. జనవరి 28 నుంచి విశాఖపట్నంలో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు వారు అర్హత సాధించారన్నారని చెప్పారు. విజేతలైన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జీఎన్.రమేశ్, మెంటార్స్ ఈసీఈ సీనియర్ లెక్చరర్ సుజాత, మెకానికల్ లెక్చరర్ సి.శోభనాద్రి, ఇతర అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# తహసీల్దార్ కార్యాలయంలో వైసీపీ హవా!



వీఆర్వోతో టీడీపీ నేతల వాగ్వాదం, రికార్డు రాస్తున్న గోవిందు

చౌడేపల్లె, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : చౌడేపల్లె తహసీల్దార్ కార్యాలయంలో వైసీపీ హవా నడుస్తోంది. రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రెడ్డెప్ప సోమవారం తన కుమారులకు బర్త్ సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాడు.అయితే వైసీపీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు గోవిందు అక్కడ రికార్డులు రాస్తుండడం గమనించారు.రెడ్డెప్పతో పాటు టీడీపీ కార్యకర్తలు బీర్జేపల్లె రెడ్డెప్ప, సుధాకర్ కలసి ఆఫీస్ రికార్డులు రాయడానికి ఏమి హక్కు ఉందంటూ గోవిందు వద్ద రికార్డులు తీసుకున్నారు.అయితే అక్కడేవున్న 29ఏ చింతమాకులపల్లె వీఆర్వో రెడ్డెప్ప తానే రికార్డులు రాయమన్నానంటూ వారితో వాగ్వాదానికి దిగాడు.ఈలోపు గోవిందు అక్కడినుంచి వెళ్ళిపోవడంతో డీటీ మాధవిని వివరణ కోరారు.తమకు తెలియకుండా కొందరు వీఆర్వోలు ఇలా చేస్తున్నారన్న ఆమె ఇకపై ఇలా జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.మాజీ వలంటీర్లు కొంతమంది కూడా రెవెన్యూ కార్యాలయంలో దందాలు నడుపుతున్నట్లు ఆరోపణలున్నాయి.

## గజస్తంభ ప్రాణప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో కాశీవిశ్వేశ్వరస్వామి, గజస్తంభ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా నిర్వహిస్తున్న పూజలు

పుంగనూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పుంగనూరు అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ గజస్తంభ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాలను సోమవారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో వేదపండితులు ప్రారంభించారు. స్థానిక కోనేరు వద్ద గల ఆలయంలో ఇటీవల భారీ రాతి గజస్తంభాన్ని ఏర్పాటు చేయగా, ప్రాణప్రతిష్ఠ, కుంభాభిషేకం, హోమాది కార్యక్రమాలను అర్చకులు బాలసుబ్రహ్మణ్యం, రామచంద్రస్వాములు శాస్త్రోక్తంగా మొదలు పెట్టారు. ఆలయంలోని మూలవిరాట్టు కాశీవిశ్వేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం గణపతి ప్రార్థన, పుణ్యాహవచనం, అంకురార్పణ, కలశస్థాపన, గజస్తంభం శుభ్రం చేసి పూజలు చేశారు. మంగళవారం వాస్తుపూజ, వాస్తు హోమం, బలిపర్యగ్నికరణం, అగ్నిప్రతిష్ఠ, ఛాయాజలాధివాసం, కళా,మూర్తి,కాలభైరవ హోమాలు, కాలభైరవ ఆలయసంప్రోక్షణ, 25వతేది శేషహోమం,జయాదిప్రాయశ్చిత్త హోమం, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం, నాడీ సంధానం, గజస్తంభ ప్రాణప్రతిష్ఠ, కాలభైరవ హోమం, సాయంత్రం గజస్తంభంపై ఆకాశ దీపారాధన, కోనేటి ప్రాంగణంలో వైభవంగా దీపారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయ కూరగాయల విక్రయం


ప్రకృతి సాగు కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారస్తులు

పుంగనూరు డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను విక్రయిస్తున్నట్లు పుంగనూరు ఏడీఏ శివకుమార్‌రాజు తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మండల పరిధిలో రైతులు కూరగాయల విక్రయాలు ప్రారంభించారు. ప్రజలు ఈ కూరగాయలను కొనుగోలు చేసి సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ప్రకృతి వ్యవసాయోత్పత్తులు ఆరోగ్యానికి శ్రేయస్కరం

రామకుప్పం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని టీడీపీ రామకుప్పం మండల సీనియర్ నేత రామ్మూర్తి తెలిపారు. సోమవారం రామకుప్పంలో ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఆకుకూరలు, కూరగాయల విక్రయాల కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి సోమవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో ఈ విక్రయ కేంద్రం కొనసాగుతుందని ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది తెలిపారు. రామకుప్పం మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## బాస్కెట్‌బాల్ కోర్టు ప్రారంభం


బాస్కెట్‌బాల్ కోర్టును ప్రారంభిస్తున్న డీఎస్పీ డేగల ప్రభాకర్

పలమనేరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో సోమవారం బాస్కెట్‌బాల్ కోర్టును డీఎస్పీ డేగల ప్రభాకర్ ప్రారంభించారు. ఈకోర్టును స్థానిక సీడీసీ సభ్యులు శ్రీపురం సీతారామయ్య కుమార్తె సురేఖ రూ.1.5 లక్షలు, స్థానిక శ్రీచైతన్య విద్యాసంస్థల అధిపతి కిషోర్‌కుమార్ రూ.90 వేలు వెచ్చించి ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశులు, శ్రీపురం సీతారామయ్య, కిషోర్‌కుమార్, అధ్యాపకులు, సీడీసీ సభ్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## బురదమయమైన బస్టాండును
# బాగు చేయించండి

● ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌కు టీడీపీ నేతల విజ్ఞప్తి


బురదమయమైన వి.కోట ఆర్టీసీ బస్టాండు

వి.కోట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మూడు రాష్ట్రాల కూడలి ప్రాంతమైన వి.కోట ఆర్టీసీ బస్టాండు బురద మయంగా మారిందని, బాగు చేయించాలని స్థానిక టీడీపీ నేతలు ఆ సంస్థ వైస్ ఛైర్మన్ పీ.ఎస్.మునిరత్నంకు విజ్ఞప్తి చేశారు. సోమవారం వి.కోటకు వచ్చిన ఆయన్ను స్థానిక టీడీపీ నేతలు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్టాండు ఆవరణలో ప్రయాణికులు రాకపోకలు సాగించలేక ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. మరుగుదొడ్ల నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయని తెలిపారు. విచ్చలవిడిగా బస్టాండు రోడ్డును ఆక్రమించి దుకాణాలు నిర్మించడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. బస్టాండుకు మరో వైపు ఉన్న దారిని మూసేసి అక్కడ పార్కింగ్ ఏర్పాటు చేయడం సమంజసమన్నారు. ఆర్టీసీ బస్టాండు ఆధునికీకరణ, సీసీ రోడ్డు తదితర మౌలిక వసతులు కల్పించాలని వారు కోరారు. దీనిపై స్పందించిన ఆయన త్వరలోనే క్షేత్ర స్థాయి పర్యటనకు వచ్చి ఆర్టీసీ బస్టాండులో సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. మాజీ వైస్ ఎంపీపీ గోపీనాథ్, మండల టీడీపీ కార్యదర్శి సోము, భక్తా, సుబ్రమణ్యంశెట్టి తదితరులు పాల్గొన్నారు.



## నేడు విద్యుత్‌సరఫరాకు అంతరాయం

పలమనేరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పలమనేరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర సాంకేతిక మరమ్మతులు చేపడుతున్నందున ఈనెల 24వ తేది మంగళవారం మధ్యాహ్నం 12నుంచి 3గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ చిన్నబ్బ తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు గాను సాంకేతిక మరమ్మతులు చేస్తున్నట్లు ఏడీఈ తెలిపారు. వినియోగదారులు ఈవిషయం గమనించి సహకరించాలని కోరారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేడు జాతీయ సదస్సు

పలమనేరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత, నవకల్పనలు, వ్యవస్థాపక సుస్థిరతను సాధించడంలో నేటి మహిళపాత్ర అనే అంశాలపై పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. నాలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారని సమన్వయకర్త రుక్మిణి తెలిపారు.

## దోబీ కాలనీ కోసం భువనేశ్వరికి వినతి


భువనేశ్వరికి వినతిపత్రం ఇస్తున్న రజక కులస్తులు

కుప్పం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలోని రజకులకోసం దోబీ కాలనీ ఏర్పాటు చేయాలని రజక కులస్థులు ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిని కోరారు. కుప్పంలో నాలుగురోజులు పర్యటించిన ఆమెను రజక కులస్థులు కలిసి తమ బాధలు విన్నవించారు. అలాగే తమకు 60 తొట్టెలతో దోబీఘాట్లు, అక్కడే రజక కమ్యూనిటీ హాలు నిర్మించాలని కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తామని భువనేశ్వరి వారికి హామీ ఇచ్చారు.

## భూతగాదాలో ఒకరికి గాయాలు


చికిత్స పొందుతున్న కృష్ణమూర్తి

పుంగనూరు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భూతగాదాపై సోమవారం జరిగిన గొడవలో కత్తితో దాడి చేయడంతో ఓ వ్యక్తి గాయపడి పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి కథనం మేరకు వివరాలు... పుంగనూరు మండలం పాళ్యంపల్లె పంచాయతీ జువ్వలదిన్నెకు చెందిన రామయ్య కుమారుడు కృష్ణమూర్తి(45)కి గ్రామ సమీపంలో పూర్వీకులనుంచి వచ్చిన భూమిలో వ్యవసాయం చేస్తున్నట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన నరసింహులు నాయక్ ఆ భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేయడంతో తాను అడ్డుపోగా తనపై కత్తితో దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. గాయపడిన కృష్ణమూర్తిని కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

## మద్యం మత్తులో స్నేహితుడిపై దాడి

పుంగనూరు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో తన స్నేహితుడిపైనే దాడి చేసి గాయపరిచిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి పుంగనూరు పట్టణ సమీపంలోని టిడ్కో ఇళ్లలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని బాలాజీ థియేటర్ సమీపంలో ఉన్న భాస్కర్‌రెడ్డి కుమారుడు ప్రకాశ్(30)కు అదే ప్రాంతానికి చెందిన సూరి, హరీశ్‌లు స్నేహితులు. మరో స్నేహితుడు(గణేశ్) ఇంటిలో జరిగిన విందులో అందరూ కలసి మద్యం సేవించి టిడ్కో ఇళ్లలో నిద్రపోవడానికి వెళ్లారు. గణేశ్, ప్రకాశ్ ముందుగా ఇంటిలో పడుకున్నారు. కొంత సమయానికి మద్యం సేవించిన సూరి, హరీశ్‌లు వెళ్లి తలుపులు తీయాలని కేకలు వేశారు. ప్రకాశ్ లేచి తలుపులు తీయగా ఎంత సమయం వేచి ఉండాలని ఆగ్రహంతో సూరి, హరీశ్‌లు గెరిటతో అతడి తల, చెవిపై కొట్టడంతో.. చెవి తెగిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన ప్రకాశ్‌ను స్నేహితులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు.

## సర్వమతసారం మానవత్వమే


కుప్పంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

కుప్పం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సర్వమతసారం మానవత్వమేనని టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు అన్నారు. కుప్పంలోని టేలర్ హైస్కూల్‌లో సోమవారం జరిగిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అహింస, ధర్మం, సత్యం బోధించిన క్రీస్తు అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రిస్మస్ అలంకరణలు, క్రిస్మస్ తాత వేషాలు చిన్నారులను అలరించాయి. అనంతరం వివిధ పోటీలలో విజేతలైన చిన్నారులకు బహుమతులు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టేలర్ హైస్కూల్ పూర్వవిద్యార్థులు సీఎస్.సుదర్శన్, రూబీ, తౌసిఫ్, ప్రమోద్‌కుమార్, అహ్మద్ బాషా, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కాశీవిశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

రామకుప్పం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ధనుర్మాస సోమవారాన్ని పురస్కరించుకుని రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామున అర్చకులు కృష్ణమూర్తి, హరినాథ్‌లు స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి, స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణ చేశారు. ఉదయం, సాయంత్రం భక్తులు దేవతామూర్తిలను దర్శించుకుని అర్చనలు చేయించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

## హైందవ శంఖారావానికి తరలిరండి


హైందవ శంఖారావం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

రామకుప్పం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావానికి ప్రజలు తరలి రావాలని బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహ, ఎస్సీమోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి ఆంజనేయప్ప, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్‌లు కోరారు. సోమవారం వారు రామకుప్పంలో హైందవ శంఖారావం పోస్టర్లను ఆవిష్కరించి, ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు.

## సీపీఐ శతజయంతి ఉత్సవాన్ని విజయవంతం చేయండి

పలమనేరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26వ తేదీన జరుగనున్న సీపీఐ శతజయంతి ఉత్సవాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు విజ్ఞప్తి చేశారు. సోమవారం పలమనేరు సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఐని 1925 డిసెంబరు 26న కాన్పూరులో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆనాటినుంచి నేటి వరకు ప్రజల కొరకు, బడుగు బలహీన వర్గాలు, కార్మికుల సంక్షేమం కోసం, హక్కుల కోసం, అణగారిన వర్గాలకోసం పోరాడుతోందన్నారు. జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు దాసరి చంద్ర, నియోజకవర్గ నాయకులు చెన్నకేశవులు, బుర్ర మంజునాథబాబు, గుర్రప్ప, శంకరప్ప, రాజసులోచన, శాంతమ్మ, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

# గుంతలమయమైన రోడ్లు

● ప్రమాదాల బారిన వాహన చోదకులు


బోడిపాటివారిపల్లె వద్ద గుంతల రోడ్డు


రొంపిచెర్ల వద్ద రోడ్డు దుస్థితి

రొంపిచెర్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలంలోని పలు రోడ్లు గుంతలుపడి కొద్దిపాటి వర్షానికే నీరు చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. వీటిని మర్మతులు చేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది. రొంపిచెర్ల - ఎర్రావారిపాలెం మండలానికి వెళ్లే రహదారిలో రొంపిచెర్ల, బోడిపాటివారిపల్లె గ్రామాల వద్ద గుంతలు పడ్డాయి. ప్రముఖ పుణ్యక్షేత్రం తలకోనకు ఈమార్గం దగ్గరగా ఉంటుందని చిత్తూరు, మదనపల్లె, రాయచోటి, పీలేరు వంటి పట్టణాల నుంచి వచ్చే వాహనదారులు ఈ గుంతలతో ఇబ్బంది పడుతున్నారు. బస్సులు లేక ఎక్కువ మంది ద్విచక్ర, ఇతర వాహనాలలో వెళుతూ గుంతలు గుర్తించక ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# దివ్యాంగులు, వృద్ధుల జీవితంలో వెలుగుల కోసం!

● కిటకిటలాడిన జీవన సహాయ ఉపకరణాల లబ్ధిదారుల గుర్తింపు శిబిరం


శిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటున్న జనం


విభిన్న ప్రతిభావంతుడితో మాట్లాడుతున్న పీఎస్.మునిరత్నం తదితరులు

కుప్పం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వృద్ధుల జీవితాల్లో వెలుగులు నింపడానికి ప్రభుత్వం వారికి జీవన సహాయ ఉపకరణాల పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం అర్హులను గుర్తించడానికి కుప్పంలో సోమవారం గుర్తింపు శిబిరం నిర్వహించింది. కుప్పం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ శిబిరం వృద్ధులు, దివ్యాంగులు, వారికి సహాయంగా వచ్చిన సహాయకులతో కిటకిటలాడింది. పేర్లు నమోదు చేయడం, వృద్ధుల వయసు నిర్ధారణ, దివ్యాంగుల వికలత్వం నిర్ధారణ చేయడం, వారికి లబ్ధిదారునిగా గుర్తింపు కార్డులివ్వడం వంటి కార్యక్రమాలతో కౌంటర్లు నిండిపోయాయి. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, కడా పీడీ వికాస్ మర్మత్, ఆర్డీవో శ్రీనివాసరాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సాయిలహరి తదితరులు శిబిరాన్ని సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా పీఎస్.మునిరత్నం, కడా పీడీ వికాస్ మర్మత్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో అలింకో సంస్థ ద్వారా దివ్యాంగులు, వృద్ధులకు జీవన సహాయ ఉపకరణాలను పంపిణీ చేస్తామన్నారు. ముందుగా అర్హులను గుర్తించడానికి ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శిబిరాన్ని సందర్శించిన విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ ఏడీ మాట్లాడుతూ కుప్పంలో నిర్వహించిన శిబిరానికి 815 మంది హాజరు కాగా, వీరిలో 697 మందిని జీవన సహాయ ఉపకరణాల పంపిణీకి అర్హులుగా గుర్తించినట్లు చెప్పారు. రామకుప్పంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఇటువంటి శిబిరమే జరుగుతుందని.. శాంతిపురం, రామకుప్పం మండలాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

● ప్రచార లోపం: విభిన్న ప్రతిభావంతులకు, వయో వృద్ధులకు ఎంతో ఉపయోగపడే అర్హుల గుర్తింపు శిబిరానికి అధికారులు సరైన ప్రచారం కల్పించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అనుకున్నదానికంటే తక్కువగానే ఈ శిబిరానికి అర్హులు హాజరయ్యారు. కుప్పం మున్సిపాలిటీ, కుప్పం మండలం, గుడుపల్లె మండలాలకు సంబంధించి కుప్పంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శిబిరం జనంతో కిటకిటలాడినా అధికారులు సరైన ప్రచారం కల్పించివుంటే ఇంతకు రెట్టింపు మంది హాజరై, రెట్టింపు సంఖ్యలో అర్హులు తేలేవారని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

## నకిలీ విత్తన నారుతో నష్టపోయిన రైతు


గానుగచింతలో టమోటా నారుతో నష్టపోయిన రైతు

రొంపిచెర్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో గానుగచింత పంచాయతీ గొల్లపల్లెకు చెందిన రైతు పెద్దబ్బ నకిలీ విత్తన నారుతో మోసపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ రొంపిచెర్ల క్రాస్‌లోని ఓ నర్సరీలో సాలార్ రకం టమోటా మొక్కలు కొనుకోలు చేసి తనకున్న 1.5 ఎకరాలలో నాటానని చెప్పారు. పంట దిగుబడి వచ్చినప్పటికీ కాయలు రంగు రాకపోగా పూర్తిగా రాలిపోతున్నాయని వాపోయారు. దీనికోసం సుమారు రూ.రెండు లక్షలు ఖర్చుచేయగా, రూ.5వేలు కూడా చేతికి రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## ఎస్టీల భూ ఆక్రమణలను అడ్డుకున్న యానాదులు


దున్నుతున్న ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న యానాదులు

చౌడేపల్లె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్టీల భూ ఆక్రమణలను వెంకటాపల్లె యానాదులు అడ్డుకున్నారు. సోమవారం మండలంలోని దిగువ పల్లె పంచాయతీ మోట్లపల్లెకు చెందిన యానాదులకు కొన్నిసంవత్సరాల క్రితం ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది. యానాదులైన కేశవులు, శారద, వెంకటలక్ష్మి, రామకృష్ణలకు చెందిన భూమిని కొందరు భూస్వాములు ట్రాక్టర్‌తో దున్నుతుంటే సోమవారం వారు అడ్డుకున్నారు. ఈఘర్షణలో యానాదులకు గాయాలు కావటంతో పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

## పంచాయతీ బకాయిలు నెలాఖరుకు చెల్లించండి

రొంపిచెర్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల పంచాయతీ పరిధిలో చెల్లించాల్సిన బకాయిలను ఈ నెలాఖరులోగా చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్ అన్నారు. సోమవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ప్రజలు ఇంటి, నీటిపన్నులు, వ్యాపార గదుల బకాయిలు చెల్లించాలని కోరారు. పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాల్సి ఉందన్నారు. గ్రామంలో అక్కడక్కడ జ్వరాలు ఉన్నాయని, పారిశుధ్య పనులకు ప్రజలు సహకరించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారం రోజులుగా కురిసిన వర్షాలకు దగ్గు, జలుబు వంటివి కాకుండా కాచి చల్లార్చిన నీరు తాగాల్సిందిగా సర్పంచ్ కోరారు.

## ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం మంజూరు హర్షణీయం

పుంగనూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇమామ్, మౌజన్లలకు గౌరవవేతనం మంజూరు చేయడం హర్షణీయమని టీడీపీ మైనార్టీ నాయకుడు ఎస్.సుహేల్‌బాషా పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం 2022లో ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం పెంచినప్పటికీ సక్రమంగా పంపిణీ చేయకపోగా మూడు, నాలుగు నెలలకొకసారి ఇచ్చేవారన్నారు. జిల్లాలో దాదాపు 150 మసీదుల్లో ఉన్న 300మంది ఇమామ్, మౌజన్లకు గౌరవవేతనం అందిస్తున్నట్లు వివరించారు. కూటమి ప్రభుత్వానికి ముస్లిం, మైనార్టీలు రుణపడి ఉండాలన్నారు. సమావేశంలో మైనార్టీ నాయకులు అబ్బాస్, నదీంబాషా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ పరికరాల ఎంపిక శిబిరం

రామకుప్పం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర సామాజిక, న్యాయ, సాధికార మంత్రిత్వశాఖ సౌజన్యంతో కాన్పూర్ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ వారిచే రామకుప్పంలో మంగళవారం దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ పరికరాల ఎంపిక శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లక్ష్మీకాంత్ తెలిపారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించే ఈ శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులు తమ వెంట ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్, రేషన్‌కార్డులు 2సెట్ల జెరాక్స్, 4ఫొటోలు, మొబైల్ నెంబరు, వయోవృద్ధులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణపత్రాల 2 సెట్ల జెరాక్స్‌లు, మొబైల్ నెంబరు తీసుకురావాలని ఆయన వివరించారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు, వయోవృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## భూ పంపిణీ పేరుతో మామూళ్లు ఇవ్వొద్దు

సోమల, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజలు భూపంపిణీ పేరుతో దళారులకు మామూళ్లు ఇవ్వవద్దని తహసీల్దార్ బెన్నురాజ్ తెలిపారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో గ్రీవెన్స్‌డే సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా పలువురు తమ గ్రామాల పరిధిలో ప్రభుత్వ భూములు ఉన్నాయని, వాటిని పంపిణీ చేయాలని వినతులు అందజేశారు. తహసీల్దార్ స్పందిస్తూ ప్రభుత్వ ఆదేశాలు ఉంటేనే భూ పంపిణీ చేస్తామని, దళారులు, ఇతర వ్యక్తుల మాయమాటలు నమ్మి డబ్బులు ఇవ్వరాదని, ఎవరైనా అలాగే చేస్తే కఠినచర్యలు తప్పవన్నారు. ఈక్రమంలోనే పలువురు దారిసమస్యలు, భూ ఆక్రమణలపై ఫిర్యాదు చేశారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు

పుంగనూరు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై రైతుల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పుంగనూరు తహసీల్దార్ జే.రాము తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ప్రజలు, రైతుల నుంచి వినతులను తీసుకున్నారు. ఈ సందర్భంగా దండుపాళ్యం, గుడిసిబండ, రాగానిపల్లె గ్రామాల నుంచి భూసమస్యలపై వినతులు వచ్చినట్లు ఆయన తెలిపారు. 1(బి), తల్లిదండ్రుల ఆస్తులను బిడ్డల పేర్లపై మార్పులు, డీకేటీ భూముల రికార్డుల మార్పు తదితర సమస్యలపై అర్జీలు వచ్చినట్లు ఆయన చెప్పారు.

## ఎస్సీ, ఎస్టీల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి

పుంగనూరు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాలను సకాలంలో అందించి వారి ఆర్థికాభివృద్ధికి సహకరించాలని పుంగనూరు తహసీల్దార్ రాము కోరారు. సోమవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పట్టణంలోని ఇండియన్ బ్యాంకు, యూనియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్, కెనరా బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ అధికారులు, దళిత సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి యేటా ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం అందించే సబ్సిడీ రుణాలను పూర్తి స్థాయిలో అందించాలన్నారు. సమావేశంలో దళిత సంఘ నాయకులు రామయ్య శ్రీనివాసులు, మధుబాబు, చిన్నరాయుడు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## 28న మున్సిపల్ సాధారణ సమావేశం

పుంగనూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28న పుంగనూరు మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ ఎస్.అలీంబాషా తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పట్టణాభివృద్ధి, ఇతర సమస్యల అజెండాపై చర్చించడానికి ఏర్పాటు చేసిన మున్సిపల్ సమావేశానికి అధికారులు, కౌన్సిలర్లు తప్పని సరిగా హాజరుకావాలని కోరారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బంగారుపాళ్యం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ మైదానంలో ఈనెల 21వ తేదీన జరిగిన అండర్-16 జిల్లా స్థాయి బాల, బాలికల క్రాస్ కంట్రీ అథ్లెటిక్ పోటీల్లో మహర్షి రాక్ ఫోర్ట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. జిల్లా స్థాయి బాలికల విభాగంలో.. రెండో స్థానంలో భానుప్రియ, మూడో స్థానంలో జ్వాల, బాలుర విభాగంలో.. రెండో స్థానంలో మహేష్ నిలిచారు. అలాగే వీరు జనవరి ఐదో తేదీన జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ అజయ్ కుమార్ తెలిపారు. ఈ విద్యార్థులను పాఠశాల ఛైర్మన్ జయశంకర్, ప్రిన్సిపాల్ గోవిందస్వామి, ఉపాధ్యాయులు, సిబ్బంది సోమవారం అభినందించారు.

## రేషన్ బియ్యం తరలింపు కేసులో ఇద్దరి అరెస్టు

బంగారుపాళ్యం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న కేసులో ఇద్దరిని అరెస్టు చేశారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది శుక్రవారం ఉదయం కేజీ సత్రం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా లారీలో అక్రమంగా తరలిస్తున్న 14 టన్నుల రేషన్ బియ్యం పట్టుబడింది. అప్పటికే లారీ డ్రైవర్ వాహనాన్ని వదిలి పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం నిందితులైన తవణంపల్లె మండలం సరకల్లు గ్రామానికి చెందిన కిరణ్ కుమార్, బీహార్‌కు చెందిన లారీ డ్రైవర్ ప్రదీప్ కుమార్‌లను అరగొండ ఫ్లైఓవర్ వద్ద గుర్తించి, అరెస్టు చేశారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

# చెరువుల ఆధునికీకరణకు కృషి చేస్తా : భానుప్రకాష్


నింద్ర సాగునీటి సంఘ అధ్యక్షుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నింద్ర, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చెరువుల ఆధునికీకరణకు కృషి చేస్తానని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ అన్నారు. సోమవారం నింద్ర సాగునీటి సంఘ అధ్యక్షుడు బలరాంరెడ్డి.. రైతులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యేని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బలరాం రెడ్డిని ఎమ్మెల్యే సన్మానించారు. నాయకులు విజయ్‌కుమార్, భాస్కర్, శరవణ, తంగరాజ్, భక్తవత్సలం, క్రిష్ణమనాయుడు, రాము, గోపి పాల్గొన్నారు.

## సమస్యలను త్వరగా పరిష్కరించాలి


అర్జీ స్వీకరిస్తున్న సహాయ కమిషనర్ ప్రసాద్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను సహాయ కమిషనర్ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఇంజనీరింగ్‌కు 4, ప్రజారోగ్య విభాగానికి రెండు అర్జీలు అందాయి. ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి


సిబ్బందికి సూచనలిస్తున్న శివసుబ్రహ్మణ్యం

గుడిపాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా కమ్యూనిటీ అధికారి శివసుబ్రహ్మణ్యం అన్నారు. బట్టువాళ్లూరులో లార్వా సర్వే చేపట్టారు. దోమలు పుట్టకూడదు, కుట్టకూడదు అంటూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది చంద్రశేఖర్, సోని, శింబు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల్లో పారదర్శకత కోసమే తనిఖీలు



సభలో ప్రసంగిస్తున్న మల్లికార్జున

పాలసముద్రం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకత కోసమే సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వాటర్‌షెడ్ అడిషినల్ పీడీ మల్లికార్జున అన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో సోమవారం జరిగిన సామాజిక తనిఖీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. మండలంలో 2023-24 సంవత్సరంలో ఉపాధి కింద 13 పంచాయతీల్లో రూ.5కోట్లు వెచ్చించి 814 పనులు చేశారన్నారు. ఈపనులను 10 రోజులుగా వివిధ గ్రామాల్లో తనిఖీ బృందం పరిశీలించిందని చెప్పారు. గుర్తించిన అవకతవకలను సభ దృష్టికి తీసుకొచ్చి చర్చించారు. ఎంపీపీ శ్యామల శివప్రకాష్‌రాజు, జడ్పీటీసీ అన్బు, క్లస్టర్ ఏపీడీ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో కృష్ణ మహేష్‌రెడ్డి, విజిలెన్స్ ఆఫీసర్ శివయ్య, ఎస్ఆర్‌పీ మల్లికార్జున్, ఏపీవో మార్గరెట్, సిబ్బంది, కూలీలు పాల్గొనారు.

## ఓంశక్తి గుడిలో అమ్మవారికి మొక్కు చెల్లింపు



పాలసముద్రం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిశ్శింకాపురంలోని ఓంశక్తి గుడిలో అమ్మవారికి గ్రామస్తులు మొక్కు చెల్లించారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి ముఖ్యమంత్రిగా చంద్రబాబు కావాలని అమ్మవారికి 2023 డిసెంబరులో మొక్కుకున్నారు. ఇందులో భాగంగా గుడిలో సోమవారం అమ్మవారికి పూజలు చేసి, భక్తులకు అన్నదానం చేశారు. టీడీపీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి భీమనేని చిట్టిబాబునాయుడు, నేతలు వాసునాయుడు, వెంకటేశులునాయుడు, రవినాయుడు, జె.విజయకుమార్, రమేష్‌నాయుడు, రాజేంద్రనాయుడు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో స్నేహితుడిపై దాడి

పుంగనూరు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో తన స్నేహితుడిపైనే దాడి చేసి గాయపరిచిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి పుంగనూరు పట్టణ సమీపంలోని టిడ్కో ఇళ్లలో చోటు చేసుకుంది. పట్టణంలోని బాలాజీ థియేటర్ సమీపంలో ఉన్న భాస్కర్‌రెడ్డి కుమారుడు ప్రకాశ్(30)కు అదే ప్రాంతానికి చెందిన సూరి, హరీశ్‌లు స్నేహితులు. మరో స్నేహితుడు(గణేశ్) ఇంటిలో జరిగిన విందులో అందరూ కలసి మద్యం సేవించి టిడ్కో ఇళ్లలో నిద్రపోవడానికి వెళ్లారు. గణేశ్, ప్రకాశ్ ముందుగా ఇంటిలో పడుకున్నారు. కొంత సమయానికి మద్యం సేవించిన సూరి, హరీశ్‌లు వెళ్లి తలుపులు తీయాలని కేకలు వేశారు. ప్రకాశ్ లేచి తలుపులు తీయగా ఎంత సమయం వేచి ఉండాలని ఆగ్రహంతో సూరి, హరీశ్‌లు గెరిటతో అతడి తల, చెవిపై కొట్టడంతో.. చెవి తెగిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన ప్రకాశ్‌ను స్నేహితులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు.

## నకిలీ విత్తన నారుతో నష్టపోయిన రైతు



రొంపిచెర్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో గానుగచింత పంచాయతీ గొల్లపల్లెకు చెందిన రైతు పెద్దబ్బ నకిలీ విత్తన నారుతో మోసపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ రొంపిచెర్ల క్రాస్‌లోని ఓ నర్సరీలో సాలార్ రకం టమోటా మొక్కలు కొనుకోలు చేసి తనకున్న 1.5 ఎకరాలలో నాటానని చెప్పారు. పంట దిగుబడి వచ్చినప్పటికీ కాయలు రంగు రాకపోగా పూర్తిగా రాలిపోతున్నాయని వాపోయారు. దీని కోసం సుమారు రూ.రెండు లక్షలు ఖర్చుచేయగా, రూ.5వేలు కూడా చేతికి రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బంగారుపాళ్యం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ మైదానంలో ఈనెల 21వ తేదీన జరిగిన అండర్-16 జిల్లా స్థాయి బాల, బాలికల క్రాస్ కంట్రీ అథ్లెటిక్ పోటీల్లో మహర్షి రాక్ ఫోర్ట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. జిల్లా స్థాయి బాలికల విభాగంలో.. రెండో స్థానంలో భానుప్రియ, మూడో స్థానంలో జ్వాల, బాలుర విభాగంలో.. రెండో స్థానంలో మహేష్ నిలిచారు. అలాగే వీరు జనవరి ఐదో తేదీన జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ అజయ్ కుమార్ తెలిపారు. ఈ విద్యార్థులను పాఠశాల చైర్మన్ జయశంకర్, ప్రిన్సిపాల్ గోవిందస్వామి, ఉపాధ్యాయులు, సిబ్బంది సోమవారం అభినందించారు.

## డాక్టరేట్ ప్రదానం


ఉషశ్రీ

వెదురుకుప్పం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్వీయూ కామర్స్ విభాగ పరిశోధకురాలు కె.ఉషశ్రీ డాక్టరేట్ పొందారు. 'ప్రైమరీ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ సొసైటీస్ అండ్ ఫార్మ్ ఫైనాన్స్ ఇన్ చిత్తూరు డిస్ట్రిక్ట్' అంశంపై కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయలురెడ్డి పర్యవేక్షణలో సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ఇది తమ కళాశాల చరిత్రలో ఒక మైలురాయి అని ప్రిన్సిపాల్‌తోపాటు ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ధనంజయరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలపై నేడు బీఎస్పీ నిరసన

చిత్తూరు అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలపై మంగళవారం జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్యక్రమం జరుగుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

# మినీ గోకులాలు పెనుమూరుకు లేవా..?

### పశువైద్యాధికారి వద్దకు కాళ్లరిగేలా తిరుగుతున్న దరఖాస్తుదారులు

పెనుమూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా తెల్ల రేషన్‌కార్డుదారులకు ఆవులు, గొర్రెలు, కోళ్ల పెంపకానికి 90 శాతంతో మినీ గోకులం షెడ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పెనుమూరు మండలంలో మూడు నెలల క్రితం సుమారు 400 మంది వివిధ రకాల షెడ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో అన్ని మండలాల్లో షెడ్ల నిర్మాణాలు దాదాపు పూర్తయి బిల్లులు కూడా లబ్ధిదారులకు జమయ్యాయి. కానీ పెనుమూరు మండలంలో మాత్రం ఇంత వరకు ఒక్కటి కూడా మంజూరు కాలేదు. ఇటీవల కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి గోకులం షెడ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని, వీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వచ్చిన నిధులను ఖర్చు చేయాలని ఆదేశించారు. పెనుమూరు మండలానికి మాత్రం ఒక్కటి కూడా మంజూరు కాకపోవడంలో ఆంతర్యమేమిటో మండల వాసులకు అంతుపట్టడం లేదు. దరఖాస్తుదారులు మాత్రం ప్రతి రోజూ పశువైద్యాధికారి వద్దకు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. దరఖాస్తుదారుల జాబితా పంపామని.. జిల్లా నుంచి మంజూరు కాలేదని.. వచ్చాక చెబుతామని వైద్యాధికారి చెప్పి పంపిస్తున్నారు.

## హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి



హెల్మెట్‌ధారణపై ద్విచక్ర వాహనదారులకు చిత్తూరులో ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. సోమవారం కూడా ఎంఎస్ఆర్ కూడలి వద్ద 'హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి' అన్న ప్లకార్డును పట్టుకుని ఓ ట్రాఫిక్ పోలీసు ఇలా కనిపించారు.

# ముందస్తు క్రిస్మస్ వేడుకలు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనగర్ కాలనీ ఉషానగర్ బాల వికాస్ కేంద్రంలో సోమవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు జరిగాయి. విద్యార్థులు పుర వీధుల్లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి.. క్రీస్తును ప్రార్థించారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. సత్యసాయి సేవాసమితి, బాల వికాస్, తదితరులు పాల్గొన్నారు.

**వెదురుకుప్పం:** కార్వేటినగరం జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో ముందస్తు క్రిస్మస్ వేడుకలను సోమవారం జరుపుకున్నారు. అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు.

**శ్రీరంగరాజపురం:** బసివిరెడ్డిపల్లెలోని షికారీ కాలనీలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. కాలనీలోని పిల్లలు క్రిస్మస్ తాత వేషధారణతోపాటు ఆటపాటలతో సందడి చేశారు. భారీ కేక్ కట్ చేసి, అన్నదానం చేశారు. స్థానిక సర్పంచ్ వరదమ్మ, పాస్టర్ తులసిమణి, రవి, చిరంజీవి, ఆయిల్‌సక్ పాల్, ఏసన్న పాల్గొన్నారు.




కొవ్వొత్తులతో బాలవికాస్ విద్యార్థుల ర్యాలీ - కార్వేటినగరం డైట్‌లో జరిగిన వేడుకల్లో అధ్యాపకులు - బసివిరెడ్డిపల్లెలో జరిగిన వేడుకల్లో క్రైస్తవులు

## బెడ్‌షీట్ల వితరణ



గంగాధరనెల్లూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ సందర్భంగా వేల్కూరు షాలోమ్‌సంస్థ ఆధ్వర్యంలో పెద్దకాల్వ పంచాయతీ మిట్టదళితవాడ సీఎస్ఐ చర్చిలో 150 మంది పేదలకు సోమవారం చిత్తూరు ఆనంద టెక్స్‌టైల్స్ షాపుల మేనేజింగ్ డైరెక్టర్ ఇళవరసన్.. బెడ్‌షీట్ల వితరణతోపాటు అన్నదానం చేశారు. షాలోమ్‌సంస్థ అధ్యక్షుడు జాన్, ఆనంద టెక్స్‌టైల్స్ షాప్ మేనేజర్ కాళిముత్తు, టీడీపీ నాయకులు వెంకటేష్, స్వామిదాస్, దేవసుందరం, జ్యోతిరెడ్డి, క్రైస్తవులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలి


గ్రామ కార్యదర్శిని సన్మానించిన టీడీపీ నాయకులు

వెదురుకుప్పం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేట గ్రామ పంచాయతీలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామ కార్యదర్శి గోపి దృష్టికి టీడీపీ నాయకులు సోమవారం తీసుకెళ్లారు. అంతకుముందు ఆయన్ను సత్కరించారు. కార్వేటినగరం తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ఢిల్లీబాబురెడ్డి, ఎస్సీ సెల్ మండల ప్రధానకార్యదర్శి చెంగల్రాయులు తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి సంఘ అధ్యక్షుడికి సన్మానం



విజయపురం, డిసెంబరు 23: కళియంబాకం సాగునీటి సంఘ అధ్యక్షుడు గాలి రమేష్‌ను సోమవారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సన్మానించారు. నగరి టీడీపీ కార్యాలయంలో జరిగిన విజయనాయుడు, రాంబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ కూరగాయల విక్రయం


ప్రకృతి సాగు కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారస్తులు

పుంగనూరు డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను విక్రయిస్తున్నట్లు పుంగనూరు ఏడీఏ శివకుమార్‌రాజు తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మండల పరిధిలో రైతులు కూరగాయల విక్రయాలు ప్రారంభించారు. ప్రజలు ఈ కూరగాయలను కొనుగోలు చేసి సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## కాశీవిశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

రామకుప్పం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ధనుర్మాస సోమవారాన్ని పురస్కరించుకుని రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామున అర్చకులు కృష్ణమూర్తి, హరినాథ్‌లు స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి, స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణ చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

## టీడీపీలో మాజీ సర్పంచ్ చేరిక


మాజీ సర్పంచ్‌ని టీడీపీలోకి ఆహ్వానించిన ప్రభుత్వ విప్ థామస్

వెదురుకుప్పం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం ఇనాంకొత్తూరు మాజీ సర్పంచ్, వైసీపీ నేత పుల్లూరు ఢిల్లీరెడ్డి సోమవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ వెదురుకుప్పం అధ్యక్షుడు లోకనాథరెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి మునిచంద్రారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి చెంగల్రాయరెడ్డి, వాణిజ్య విభాగం నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి బోడిరెడ్డి వెంకటరమణారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు పి.ధర్మారెడ్డి, మోహన్‌రెడ్డి హాజరయ్యారు.

## ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి


దళితులతో మాట్లాడుతున్న తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్

బంగారుపాళ్యం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్‌కు చిన్నకొరివారిపల్లె గ్రామానికి చెందిన దళితులు సోమవారం వినతి పత్రం అందజేశారు. తమ గ్రామంలోని గ్రామకంఠం భూమిని అగ్రకులస్తులు ఆక్రమించుకున్నారని చెప్పారు. ఈ భూమిని ఇళ్ల స్థలాలు లేని పేదలకు కేటాయించాలని కోరారు. సావిత్రి, కృష్ణయ్య, శివ, హరిబాబు, గోవిందమ్మ పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం తరలింపు కేసులో ఇద్దరి అరెస్టు



బంగారుపాళ్యం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న కేసులో ఇద్దరిని అరెస్టు చేశారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది శుక్రవారం ఉదయం కేజీ సత్రం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా లారీలో అక్రమంగా తరలిస్తున్న 14 టన్నుల రేషన్ బియ్యం పట్టుబడింది. అప్పటికే లారీ డ్రైవర్ వాహనాన్ని వదిలి పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం నిందితులైన తవణంపల్లె మండలం సరకల్లు గ్రామానికి చెందిన కిరణ్ కుమార్, బీహార్‌కు చెందిన లారీ డ్రైవర్ ప్రదీప్ కుమార్‌లను అరగొండ ఫ్లైఓవర్ వద్ద గుర్తించి, అరెస్టు చేశారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

## బాస్కెట్‌బాల్ కోర్టు ప్రారంభం


బాస్కెట్‌బాల్ కోర్టును ప్రారంభిస్తున్న డీఎస్పీ ప్రభాకర్

పలమనేరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో సోమవారం బాస్కెట్‌బాల్ కోర్టును డీఎస్పీ డేగల ప్రభాకర్ ప్రారంభించారు. ఈకోర్టును స్థానిక సీపీడీసీ సభ్యులు శ్రీపురం సీతారామయ్య కుమార్తె సురేఖ రూ.1.5 లక్షలు, స్థానిక శ్రీచైతన్య విద్యాసంస్థల అధిపతి కిషోర్‌కుమార్ రూ.90 వేలు వెచ్చించి ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశులు, శ్రీపురం సీతారామయ్య, కిషోర్‌కుమార్, అధ్యాపకులు, సీపీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

# ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం మంజూరు హర్షణీయం

పుంగనూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇమామ్, మౌజన్లలకు గౌరవ వేతనం మంజూరు చేయడం హర్షణీయమని టీడీపీ మైనార్టీ నాయకుడు ఎస్.సుహేల్‌బాషా పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం 2022లో ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం పెంచినప్పటికీ సక్రమంగా పంపిణీ చేయకపోగా మూడు, నాలుగు నెలలకొకసారి ఇచ్చేవారన్నారు. జిల్లాలో దాదాపు 150 మసీదుల్లో ఉన్న 300మంది ఇమామ్, మౌజన్లకు గౌరవవేతనం అందిస్తున్నట్లు వివరించారు. కూటమి ప్రభుత్వానికి ముస్లిం, మైనార్టీలు రుణపడి ఉండాలన్నారు. సమావేశంలో మైనార్టీ నాయకులు అబ్బాస్, నదీంబాషా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షిప్తంగా..

## డ్రైనేజీ పనుల పరిశీలన



పెనుమూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పాళ్యంకొత్తూరు, పెనుమూరులో జరుగుతున్న అండర్ డ్రైనేజీ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విజయానంద్, ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఏఈ రమేష్ సోమవారం పరిశీలించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మురళి, మురగయ్య పాల్గొన్నారు.

## కాళభైరవాష్టమి పూజలు



నగరి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణ పరిధిలోని కామాక్షి సమేత కరకంఠేశ్వరస్వామి ఆలయంలో కాళభైరవాష్టమి పూజలను సోమవారం నిర్వహించారు. స్వామికి పాలు, పెరుగు, పంచామృతంతో అభిషేకం చేశారు. అనంతరం పుష్పాలతోను, వడమాలలతోను స్వామిని అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు.

## వైసీపీలోనే కొనసాగుతాం

వెదురుకుప్పం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తాను, తన భార్య వైసీపీలోనే కొనసాగుతామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పేట ధనంజయులురెడ్డి తెలిపారు. 'వైసీపీలో అంతర్గత కుమ్ములాటలు' శీర్షికన వార్త సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో వైసీపీ ముఖ్య నేతలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విజయానందరెడ్డి, భూమన అభినయ్ తనతో మాట్లాడడంతో రాజీనామా నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నామని పేర్కొన్నారు.

## ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

నగరి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. కళాశాల ఆవరణలో సోమవారం వినియోగదారుల క్లబ్ విభాగం ఏర్పాటు చేసిన జాతీయ వినియోగదారుల దినోత్సవంలో ఆయన ప్రసంగించారు. నమ్మకమైన, ప్రభుత్వ గుర్తింపు పొందిన వెబ్‌సైట్స్ ద్వారానే ఆన్‌లైన్‌లో వస్తువులను, సేవలను పొందాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రాజు ప్రసంగించగా, భాస్కర్, ఇందిరా ప్రియదర్శిని, వేణుగోపాల్, కిరణ్, హరికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## భూతగాదాలో ఒకరికి గాయాలు


చికిత్స పొందుతున్న కృష్ణమూర్తి

పుంగనూరు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భూతగాదాపై సోమవారం జరిగిన గొడవలో కత్తితో దాడి చేయడంతో ఓ వ్యక్తి గాయపడి పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి కథనం మేరకు వివరాలు... పుంగనూరు మండలం పాళ్యంపల్లె పంచాయతీ జువ్వలదిన్నెకు చెందిన రామయ్య కుమారుడు కృష్ణమూర్తి(45)కి గ్రామ సమీపంలో పూర్వీకులనుంచి వచ్చిన భూమిలో వ్యవసాయం చేస్తున్నట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన నరసింహులు నాయక్ ఆ భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేయడంతో తాను అడ్డుపోగా తనపై కత్తితో దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. గాయపడిన కృష్ణమూర్తిని కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.